మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక


www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 8-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 40 Issue: 40

08 ఆగస్టు 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:01 సూర్యాస్తమయం - సా. 6:42 తిథి దశమి మ. 1:57 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం రోహిణి సా. 4:47 వరకు తరువాత మృగశిర యోగం ధ్రువ ఉ. 8:57 వరకు కరణం విష్టి మ. 1:57 వరకు బవ రా. 12:320 వరకు వర్జ్యం ఉ. 9:28 నుండి ఉ. 10:57 వరకు దుర్ముహూర్తం ఉ. 7:42 నుండి ఉ. 8:33 వరకు రాహుకాలం ఉ. 9:11 నుండి ఉ. 10:46 వరకు యమగండం మ. 1:56 నుండి మ. 3:32 వరకు గుళికాకాలం ఉ. 6:01 నుండి ఉ. 7:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:25 నుండి తె. 5:13 వరకు అమృత ఘడియలు మ. 1:53 నుండి మ. 3:21 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:47 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial


## ఎన్టీయే వల్లే నీట్ పేపర్ లీక్

### తనిఖీలు లేకే ప్రశ్నలు బయటకు.. కాగితాలపై రాసి, గుర్తుపెట్టుకుని లీక్

**సీబీఐ చార్జిషీట్‌లో సంచలన విషయాలు.. 13 మందిపై చార్జిషీట్.. 360 మంది సాక్షులు**

నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీక్ కేసులో సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)లో ఉన్న భద్రతా లోపాలే ప్రశ్నాపత్రం బయటకు వెళ్లడానికి ప్రధాన కారణమని సీబీఐ పేర్కొంది. ముఖ్యంగా కాన్ఫిడెన్షియల్ విభాగంలో తనిఖీలు లేకపోవడం, సీసీటీవీ పర్యవేక్షణ సరిగా లేకపోవడాన్ని నిందితులు ఆసరాగా చేసుకున్నట్లు తెలిపింది.

న్యూఢిల్లీ: సీబీఐ వివరాల ప్రకారం.. ప్రశ్నాపత్రాల అనువాదం, బ్యాక్ ట్రాన్స్‌లేషన్, ప్రూఫ్ రీడింగ్ బాధ్యతలు చూసిన ముగ్గురు సబ్జెక్ట్ నిపుణులు కెమిస్ట్రీ, బయాలజీ, ఫిజిక్స్ ప్రశ్నలను పరీక్షకు ముందే బయటకు తీసుకెళ్లారు. కెమిస్ట్రీ నిపుణుడు పి.వి. కులకర్ణి ప్రశ్నలు, జవాబులను చిన్న కాగితాలపై రాసి రహస్యంగా బయటకు తీసుకెళ్లినట్లు సీబీఐ తెలిపింది. కాన్ఫిడెన్షియల్ విభాగంలో లోనికి వెళ్లే -2 వ పేజీలో...



## రామయ్య విరాళాల్లో అవినీతి జరగలే!

### రూ.3,300 కోట్లకు పూర్తి ఆడిట్... నగదు లెక్కించే సమయంలోనే చోరీ

**బ్యాంకుల ద్వారానే భూసేకరణ చెల్లింపులు.. స్పష్టం చేసిన ప్రభుత్వ వర్గాలు**

అయోధ్య రామ మందిర విరాళాలపై ఆరోపణలను ప్రభుత్వ వర్గాలు ఖండించాయి. రూ.3,300 కోట్ల విరాళాల వినియోగంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని స్పష్టం చేశాయి. మొత్తం నిధులకు స్వతంత్ర ఆడిటర్లు పూర్తిస్థాయిలో లెక్కలు పరిశీలించి ధ్రువీకరించారని వెల్లడించాయి.

లక్నో: ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు వచ్చిన రూ.3, 300 కోట్ల విరాళాలపై ఎం/ఎస్ వి శంకర్ అయ్యర్ అండ్ కో సంస్థ ఆడిట్ నిర్వహించింది. ఆలయ నిర్మాణానికి రూ.1,800 కోట్లు, భూసేకరణకు రూ.400 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. ఈ చెల్లింపులన్నీ బ్యాంకుల ద్వారానే జరిగాయని, -2 వ పేజీలో...



## దేవుడా.. వానలు కురిపించు!

**వర్షాల కోసం ప్రభుత్వం వరుణ యాగం**

**ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో నిర్వహణ**

**పూర్ణాహుతిలో పాల్గొననున్న రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 7 (ఈవార్తలు): తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించాలని-2 వ పేజీలో...




## త్వరలో డిజి అసెంబ్లీ

### పౌరుల డేటా భద్రతకు బ్లాక్‌చెయిన్ ఆధారిత సర్టిఫికెట్లు

**అన్ని గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ డిజిటల్ కనెక్టివిటీ.. 'ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాంక్లేవ్-తెలంగాణ'లో దుద్దిళ్ల వెల్లడి**

రాష్ట్రంలో త్వరలోనే డిజిటల్ అసెంబ్లీ, డిజిటల్ కౌన్సిల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. పౌర సేవలను మరింత సమర్థవంతంగా ప్రజల ముంగిటకు చేర్చేందుకు కృత్రిమ మేధ, బ్లాక్‌చెయిన్, సమాచార విశ్లేషణ, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతికతలను పాలనలో విస్తృతంగా వినియోగిస్తున్నామని చెప్పారు. గవ్ కనెక్ట్, ఎలక్ట్రానిక్ సేవల పంపిణీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బేగంపేటలోని ఐటీసీ కాకతీయలో నిర్వహించిన 'కృత్రిమ మేధ పరివర్తన సదస్సు--తెలంగాణ'ను మంత్రి ప్రారంభించారు.

హైదరాబాద్, ఆగస్టు 7 (ఈవార్తలు): ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాలనలోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ మంత్రివర్గ సమావేశాలు, 20 ప్రభుత్వ శాఖలను అనుసంధానించే ప్రత్యక్ష ప్రభుత్వ సమాచార ఫలకం, కృత్రిమ మేధ ఆధారిత సమాచార మార్పిడి వేదిక, వాట్సాప్ ద్వారా పౌర సేవల అందజేత, మీ టికెట్ వంటి పలు సంస్కరణల ద్వారా డిజిటల్ పాలనలో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపామని పేర్కొన్నారు. పౌరుల సమాచార భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ త్వరలోనే బ్లాక్‌చెయిన్ ఆధారిత తరువాయి 2 వ పేజీలో...

## 1 లక్షకు 3 లక్షలు

### కాసుల పంట పండించిన గోల్డ్ బాండ్స్



సావరిన్ గోల్డ్ బాండ్లు వినియోగదారులకు కాసుల పంట పండించాయి. 2020--21 సిరీస్-11లో పెట్టుబడి పెట్టిన వారికి గడువు పూర్తికాకముందే.. నిర్ణీత నిబంధనల ప్రకారం బాండ్లను ముందస్తుగా విమోచించుకునే అవకాశాన్ని కల్పించింది. సావరిన్ గోల్డ్ బాండ్లు జారీ అయిన ఐదు సంవత్సరాల తర్వాత నిర్ణీత వడ్డీ చెల్లింపు తేదీల్లో మాత్రమే ముందస్తు విమోచనకు అవకాశం ఉంటుంది.

న్యూఢిల్లీ: ఈ నేపథ్యంలో ఆగస్టు 8, 9 తేదీల్లో బ్యాంకులకు సెలవులు ఉండటంతో ఆర్‌బీఐ ఆగస్టు 7 నుంచే ఈ ప్రక్రియను ప్రారంభించింది. ముందస్తు విమోచనం చేసుకునే వారికి ఒక గ్రాము (యూనిట్) ధరను రూ. 14,564గా నిర్ణయించింది. ఈ ధరను ఆగస్టు 4, 5, 6 తేదీ ల్లో 999 స్వచ్ఛత గల బంగారం సగటు ముగింపు ధర ఆధారంగా నిర్ణయించారు. ఇందుకోసం ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రకటించిన -2 వ పేజీలో...

## దొంగ కాలేజీలకు జరిమానా

### 45 జూనియర్ కాలేజీలకు రూ.8 లక్షల చొప్పున ఫైన్!

**ఫేక్ ఫైర్ ఎన్వోసీలపై ఇంటర్ బోర్డు ఉక్కుపాదం**



హైదరాబాద్, ఆగస్టు 7 (ఈవార్తలు): తెలంగాణలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో వెలుగుచూసిన నకిలీ ఫైర్ సేఫ్టీ ఎన్వోసీ వ్యవహారంపై తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు కఠిన చర్యలు చేపట్టింది. బోగస్ లేదా నకిలీ ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు సమర్పించిన 45 ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు ఒక్కో కాలేజీపై తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,989 |
| వెండి (కిలో): | రూ.2,50,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,345 |

## విశ్వవాణి



జీవం ఎలా పుట్టింది? ఒక జీవ కణం కనీసం ఎలాంటి వ్యవస్థలను కలిగి ఉండాలి? అనే ప్రశ్నలకు సమాధానం కనుగొనే దిశగా శాస్త్రవేత్తలు మరో కీలక ముందడుగు వేశారు. జీవం లేని రసాయన పదార్థాలతో తయారు చేసిన 'స్ప్రడ్‌సెల్' అనే కృత్రిమ కణం.. జీవచక్రాన్ని పోలిన ప్రక్రియను పూర్తి చేయగలిగేలా అభివృద్ధి చేసినట్లు పరిశోధకులు వెల్లడించారు. ఈ కృత్రిమ కణం బయట నుంచి పోషకాలను స్వీకరించడం, పెరగడం, తన డీఎన్‌ఏను ప్రతిరూపించుకోవడం, రెండు కొత్త కణాలుగా విడిపోవడం వంటి కీలక ప్రక్రియలను నిర్వహించగలదని శాస్త్రవేత్తలు తెలిపారు. అంతేకాకుండా, అనేక తరాల పాటు కొనసాగిన ప్రయోగాల్లో సహజ ఎంపికను పోలిన పరిణామాన్ని కూడా ప్రదర్శించినట్లు పేర్కొన్నారు.



## వందేమాతరం బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ: వందేమాతరం గేయానికి మరిన్ని రక్షణలు కల్పించే నేషనల్ ఆనర్ (అమెండ్‌మెంట్) యాక్ట్-2026కు రాష్ట్రపతి ఆమోదం లభించింది. జాతీయ గేయాన్ని అవమానించడాన్ని నేరంగా గుర్తించేలా 1971 నాటి చట్టానికి కేంద్రం తాజాగా మార్పులు చేసిన విషయం తెలిసిందే. జాతీయ గీతం స్థాయిలో వందేమాతరం గేయానికి రక్షణ కల్పించేలా ఈ మార్పులు చేసింది. ఇటీవలే పార్లమెంటు ఆమోదించిన బిల్లుకు తాజాగా రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది. తాజాగా తరువాయి 2 వ పేజీలో...

## అవును! చిన్న నోట్లూ ఫేక్ చేస్తున్నారు



**రూ.20 నకిలీ నోట్లు 47.4 శాతం పెరిగాయి**

**మొత్తంగా 5.7 శాతం పెరిగిన నకిలీ నోట్లు**

**అత్యధికంగా రూ.500 నకిలీ నోట్ల దందా: ఆర్బీఐ**

భారత కరెన్సీలో చిన్ననోట్లనూ ఫేక్ చేస్తున్నారని ఆర్బీఐ తాజా నివేదికలో తెలిపింది. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ మద్దతుతో పనిచేసే దావూద్ ఇబ్రహీం నెట్‌వర్క్‌తో సహా ఇతర సిండికేట్లు, ఇప్పటివరకు రూ.500 వంటి పెద్ద నోట్లను లక్ష్యంగా చేసుకున్నాయి. అయితే, ఇప్పుడు తమ దృష్టిని రూ.10, రూ.20, రూ.50 వంటి తక్కువ విలువ కలిగిన నోట్లపైకి మళ్లించాయని భారత భద్రతా సంస్థలు గుర్తించాయి.

న్యూఢిల్లీ: మార్కెట్లోకి ఈ చిన్న నకిలీ నోట్లను భారీగా చలామణిలోకి తెచ్చి, భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలనేది వారి ప్రణాళికగా తెలుస్తోంది. 'నకిలీ భారత కరెన్సీ నోట్ల' (ఎఫ్ఐసీఎన్) చలామణిని అరికట్టేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్న వేళ, ఈ కొత్త ధోరణి వెలుగులోకి వచ్చింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) విడుదల చేసిన 2025-26 వార్షిక నివేదిక ప్రకారం.. బ్యాంకింగ్ వ్యవస్థలో గుర్తించిన మొత్తం దొంగనోట్ల సంఖ్య 5.7 శాతం పెరిగింది. తరువాయి 2 వ పేజీలో...



## చిరువ్యాపారులకు చింత లేదు

**వినియోగదారులపైనా యూపీఐ చార్జీలుండవు**

**పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధికారిక ప్రకటన**

న్యూఢిల్లీ: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై ఛార్జీలు విధించవచ్చనే చర్చలకు పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) శుక్రవారం తెరదించింది. వినియోగదారులకు యూపీఐ చెల్లింపులు యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని, చిన్న వ్యాపారుల నుంచి ఎటువంటి మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వసూలు చేయబోమని శుక్రవారం స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. 2016లో ప్రారంభమైనప్పటి నుంచి యూపీఐ సేవలు వినియోగదారులకు ఉచితంగానే అందుబాటులో ఉన్నాయని, భవిష్యత్తులోనూ లావాదేవీలపై తరువాయి 2 వ పేజీలో...

## నేతన్నకు చేయూత ఏది?

**బీమా పథకాన్ని ఎందుకు ఆపేశారు?**

**రద్దు చేసిన స్కీంలను వెంటనే పునరుద్ధరించాలి**

**సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ**



జాతీయ చేనేత దినోత్సవం వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక ధీమానిచ్చిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి గొప్ప పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి నేతన్నలను కోలుకోలేని దెబ్బతీసిందని తన లేఖలో ఆయన మండిపడ్డారు.

హైదరాబాద్, ఆగస్టు 7 (ఈవార్తలు): బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫారాల తయారీ ఆర్డర్లను పక్కనబెట్టి, కమీషన్ల కోసం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన రూ.18 వేల ఆర్థిక సాయం, రూ.లక్ష వ్యక్తిగత రుణమాఫీ, 5 శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం తరువాయి 2 వ పేజీలో...



## బోనాల పండుగ.. సైబరాబాద్‌లో వైన్స్ బంద్

**ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మకాలపై నిషేధం**

హైదరాబాద్, ఆగస్టు 7 (ఈవార్తలు): హైదరాబాద్‌లో బోనాల పండుగ నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని మద్యం దుకాణాలను మూసివేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేశ్ శుక్రవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. తరువాయి 2 వ పేజీలో...




## ఫార్చ్యూన్ సన్‌ఫ్లవర్‌లో విటమిన్ల లోపం

**ఆయిల్ కంపెనీకి ఆహార భద్రతా సంస్థ భారీ జరిమానా**

**నూనె సురక్షితమేనని, న్యాయపోరాటం చేస్తామన్న కంపెనీ**

న్యూఢిల్లీ: వంట నూనెల బ్రాండ్ ఫార్చ్యూన్ తయారీ సంస్థ, ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ లిమిటెడ్‌కు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) జరిమానా విధించింది. ఫార్చ్యూన్ బ్రాండ్‌కు చెందిన సన్‌ఫ్లవర్ ఆయిల్‌లో నిర్దేశిత నాణ్యత ప్రమాణాలు లోపించాయని నిర్ధారణ కావడంతో ఈ చర్యలు చేపట్టింది. గోవాలోని తాజ్ ఫోర్ట్ అగ్వాడా రిసార్ట్ అండ్ స్పా నుండి సేకరించిన ఒక లీటర్ 'ఫార్చ్యూన్ ఫ్రయోలా' రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ నమూనాను ఎఫ్ఎస్ఎస్ఏఐ ల్యాబ్‌లో పరీక్షించారు. ఈ పరీక్షల్లో తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు



8.8.2026

**మేషం:** చేపట్టిన పనులలో అవరోధాలు ఉన్నపటికీ సకాలంలో పూర్తిచేస్తారు. సంతానం కొన్ని విషయాలలో మీతో విభేదిస్తారు. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు తప్పవు. పాత ఋణముల ఒత్తిడి పెరుగుతుంది.

**వృషభం:** ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు పనిచేయవు. కుటుంబ సభ్యులతో అకారణ వివాదాలు కలుగుతాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడతాయి. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు నిదానిస్తాయి. వ్యాపార ఉద్యోగాలలో నిలకడ లోపిస్తుంది.

**మిధునం:** ఆర్థిక ఇబ్బందులు నుంచి కొంత వరకు బయటపడతారు. ప్రయాణాలలో నూతన పరిచయాల వలన ఆర్థిక లాభాలు పొందుతారు. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. కుటుంబ సభ్యులు నుండి వ్యతిరేకత పెరుగుతుంది. వృత్తి ఉద్యోగమున సానుకూల వాతావరణం ఉంటుంది.

**కర్కాటకం:** కొన్ని విషయాలలో అందరితో సమస్యలు కలుగుతాయి. దూర ప్రాంతాల నుంచి అందిన వార్త కొంత ఊరట కలిగిస్తుంది. ఆదాయం ఆశించిన విధంగా ఉండదు. చిన్ననాటి మిత్రులతో మాటపట్టింపులుంటాయి. ఉద్యోగమున తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు.

**సింహం:** బంధు మిత్రులతో గృహమున సంతోషంగా గడుపుతారు. ఆకస్మిక ధన లాభాలు పొందుతారు. వ్యాపారమున స్నేహితుల నుంచి పెట్టుబడులు అందుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన అవకాశములు అందుతాయి.

**కన్య:** చుట్టుపక్కల వారితో ఊహించని విభేదాలు కలుగుతాయి. ధన వ్యవహారాలలో లోటుపాట్లు తప్పవు. సంతాన ఉద్యోగ ప్రయత్నాలు కొంత నిరాశ కలిగిస్తాయి. భాగస్వామ్య వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు ఉంటాయి. ఇతరుల వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది.

**తుల:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు ధన సహాయం లభిస్తుంది. కీలక వ్యవహారాలలో మిత్రుల సలహాలు తీసుకోవడం మంచిది. నూతన వ్యాపారాల ప్రారంభానికి శ్రీకారం చుడతారు. దైవ సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. నిరుద్యోగులకు ఉన్నత అవకాశములు లభిస్తాయి.

**వృశ్చికం:** దూర ప్రాంతాల ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. చేపట్టిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తిచేస్తారు. స్థిరాస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగుపడుతుంది. కుటుంబ సభ్యులతో కలిసి గృహమున సంతోషంగా గడుపుతారు. ఉద్యోగమున ఉన్నతాధికారుల అనుగ్రహం కలుగుతుంది.

**ధనస్సు:** దైవ అనుగ్రహంతో ముఖ్యమైన పనులు పూర్తిచేస్తారు. వృత్తి ఉద్యోగాలలో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో నూతన ఉత్సాహంతో లాభాలు అందుకుంటారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి.

**మకరం:** కుటుంబ సభ్యులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు అవసరం అవుతాయి. కుటుంబ వాతావరణం మరింత చికాకు పరుస్తుంది. ఉద్యోగస్తులు అధికారులతో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. నూతన ఋణ ప్రయత్నాలు అంతగా కలిసిరావు.

**కుంభం:** ఉద్యోగమున అదనపు బాధ్యతల నుండి ఉపశమనం లభిస్తుంది. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట చెందుతారు. గృహ నిర్మాణ ఆలోచనలు వేగవంతం చేస్తారు. వ్యాపారాలలో సమర్థవంతంగా నిర్వహించి లాభాలు పొందుతారు.

**మీనం:** ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితుల సహాయ సహకారములు అందుతాయి. ఇంటా బయట శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. నూతన వ్యాపారాలు విజయవంతంగా ప్రారంభిస్తారు. నిరుద్యోగులకు అప్రయత్నంగా నూతన అవకాశాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. ప్రయాణాలలో మరింత జాగ్రత్త వహించాలి.

# త్వరలో డిజి అసెంబ్లీ

**మొదటి పేజీ తరువాయి**

ధ్రువపత్రాల జారీ ప్రక్రియకు శ్రీకారం చుడతామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలకు టీ-ఫైబర్ ద్వారా అధిక వేగం కలిగిన డిజిటల్ అనుసంధానాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పౌర సేవలను నేరుగా వారి ఇంటి వద్దకే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డిజిటల్ కార్యాలయ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో కాగిత రహిత పాలనను అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ ప్రధాన ఆర్థిక సలహాదారు, మిత్రా సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ప్రవీణ్ పరదేశి, రైల్వే సమాచార వ్యవస్థల కేంద్రం మేనేజింగ్ డైరెక్టర్ జీవీఎల్ సత్యకుమార్, నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ దేవేష్ త్యాగి, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ అదనపు కార్యదర్శి సౌరభ్ కే తివారీ తదితరులు పాల్గొన్నారు.



## దొంగ కాలేజీలకు జరిమానా

**మొదటి పేజీ తరువాయి**

రూ. 8 లక్షల చొప్పున జరిమానా విధించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ జూనియర్ కాలేజీలు సమర్పించిన ఫైర్ సేఫ్టీ ధ్రువపత్రాలపై నిర్వహించిన పరిశీలనలో అగ్నిమాపక శాఖ జారీ చేయని నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ఇంటర్ బోర్డు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. పరిశీలనలో పలు కాలేజీలు సమర్పించిన ఫైర్ ఎన్వోసీలు నకిలీవిగా తేలడంతో 45 కాలేజీలపై రూ. 8 లక్షల చొప్పున జరిమానా విధిధించాలని నిర్ణయించినట్లు సమాచారం. నిబంధనలను ఉల్లంఘించిన విద్యాసంస్థలపై అవసరమైతే తదుపరి చట్టపరమైన చర్యలు కూడా తీసుకునే అవకాశముందని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని, అగ్నిమాపక భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఇంటర్ బోర్డు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులోనూ ఫైర్ సేఫ్టీ ధ్రువపత్రాలపై కఠిన తనిఖీలు కొనసాగనున్నాయని అధికారులు సూచించారు.

## 1 లక్షకు 3 లక్షలు

**మొదటి పేజీ తరువాయి**

బంగారం ధరలను పరిగణనలోకి తీసుకున్నారు. సావరిన్ గోల్డ్ బాండ్లు విడుదలైన సమయంలో ఆన్‌లైన్‌లో గ్రాము ధర రూ. 4,862 మాత్రమే. ప్రస్తుతం అదే యూనిట్‌కు రూ. 14,564 లభిస్తోంది. అంటే ఒక గ్రాముపై రూ. 9,702 లాభం వస్తోంది. దీంతో పెట్టుబడిదారులు దాదాపు 200 శాతం లాభాన్ని పొందుతున్నారు. ఉదాహరణకు.. ఒక వ్యక్తి ఐదు సంవత్సరాల క్రితం రూ. 1 లక్ష పెట్టుబడి పెట్టి ఉంటే, ప్రస్తుతం ఆ పెట్టుబడి విలువ సుమారుగా రూ. 3 లక్షలకు చేరుతుందన్నమాట. అంతేకాకుండా.. పెట్టుబడిదారులకు మొత్తం కాలానికి ప్రతి సంవత్సరం 2.5 శాతం స్థిర వడ్డీ కూడా లభిస్తుంది. ఈ వడ్డీని ప్రతి ఆరు నెలలకు ఒకసారి పెట్టుబడిదారుడి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. సాధారణంగా సావరిన్ గోల్డ్ బాండ్లకు ఎనిమిది సంవత్సరాల మెచ్యూరిటీ ఉంటుంది. ఐదు సంవత్సరాలు పూర్తైన తర్వాత నిర్ణీత వడ్డీ చెల్లింపు తేదీల్లో ముందస్తు విమోచనకు అవకాశం కల్పిస్తారు. చివరగా బాండ్‌ను మెచ్యూరిటీ సమయంలో లేదా ముందస్తు విమోచనం చేసుకున్నప్పుడు అసలు పెట్టుబడితో పాటు చివరి వడ్డీ కూడా అందుతుంది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఆన్‌లైన్‌లో బాండ్లు కొనుగోలు చేసిన వారికి గ్రాముకు రూ. 50 తగ్గింపు ఇచ్చారు. దీంతో వారు తక్కువ ధరకు బాండ్లు కొనుగోలు చేసి, ప్రస్తుతం మరింత అధిక లాభాన్ని పొందుతున్నారు.

## వందేమాతరం బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం


**మొదటి పేజీ తరువాయి**

నిబంధనల ప్రకారం, జాతీయ గీతం లేదా గేయం ఆలాపనను అడ్డుకున్న వారికి గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ పాటల ఆలాపన జరుగుతున్న సమయంలో అడ్డంకులు సృష్టించేవారికీ ఇవే శిక్షలు విధిస్తారు. అంతకుముందున్న చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం, కేవలం జాతీయ గీతానికి ఈ రక్షణలు ఉండేవి. ప్రస్తుతం వందేమాతరం గేయానికీ ఇవే రక్షణలు కల్పిస్తూ చట్టంలో మార్పులు చేశారు.

## రామయ్య విరాళాల్లో అవినీతి జరగలే!

**మొదటి పేజీ తరువాయి**

నగదు లావాదేవీలు లేవని పేర్కొంది. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఘటన నగదు లెక్కించే సమయంలో జరిగిన చోరీ మాత్రమేనని ప్రభుత్వ వర్గాలు వివరించాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమించిన సైనిక్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థకు చెందిన ఆరుగురు సిబ్బంది నగదు దొంగిలించినట్లు సీసీటీవీ ఆధారంగా గుర్తించి వెంటనే అరెస్టు చేసినట్లు తెలిపాయి. వారికి ఆలయ ట్రస్ట్‌తో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశాయి. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం పనితీరును సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తోందని వెల్లడించాయి. సీనియర్ ఐపీఎస్ అధికారులు విచారణ చేపడుతున్నారని తెలిపాయి. భూసేకరణలో కూడా నగదు చెల్లింపులు జరగలేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అన్ని చెల్లింపులు అధికారిక బ్యాంకు ఖాతాల ద్వారానే జరిగాయని చెప్పాయి. తీర్పు తర్వాత భూముల ధరలు పెరగడం, వాణిజ్య భవనాల పరిహారం కారణంగా వ్యయం అధికంగా కనిపించిందని వివరించాయి. జూన్ 2026లో జరిగిన ఘటన తర్వాత కూడా భక్తుల విరాళాలు తగ్గలేదని వెల్లడించాయి. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో నెలకు సగటున రూ. 5 కోట్ల హుండీ ఆదాయం వచ్చినట్లు తెలిపాయి.



## ఎన్టీయే వల్లే నీట్ పేపర్ లీక్

**మొదటి పేజీ తరువాయి**

సమయంలో, బయటకు వచ్చే సమయంలో తనిఖీలు లేకపోవడంతో ఇది సాధ్యమైందని పేర్కొంది. కొన్ని ప్రశ్నలను గుర్తుపెట్టుకొని హోటల్‌కు వెళ్లిన తర్వాత రాసుకున్నట్లు వెల్లడించింది. బయాలజీ నిపుణురాలు మనీషా గురునాథ్ మండారే హోటల్‌కు వెళ్లిన తర్వాత, తనకు గుర్తున్న ప్రశ్నలకు సంబంధించిన ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకంలోని భాగాలను గుర్తు పెట్టి, వాటి ఆధారంగా ప్రశ్నలను పునర్నిర్మించినట్లు సీబీఐ వెల్లడించింది. ఫిజిక్స్ నిపుణురాలు మనీషా హవాల్దార్ కూడా పని ముగిసిన తర్వాత తన నివాసానికి వెళ్లి ప్రశ్నలను రాసుకున్నట్లు తెలిపింది. ఎన్‌టీఏ కార్యాలయంలో మరో కీలక లోపాన్ని కూడా సీబీఐ గుర్తించింది. సీసీటీవీ రికార్డులు కేవలం 20 నుంచి 25 రోజుల వరకు మాత్రమే ఉండటంతో, ప్రశ్నాపత్రాల తయారీ జరిగిన కాలానికి సంబంధించిన దృశ్యాలు అందుబాటులో లేకపోయాయని తెలిపింది. అలాగే సీసీటీవీలను ప్రత్యక్షంగా పర్యవేక్షించే ప్రత్యేక నియంత్రణ కేంద్రం కూడా లేదని పేర్కొంది. ఈ కేసులో మొత్తం 13 మందిపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. 360 మంది సాక్షులు, 422 పత్రాలు, 43 ఆధారాలను కోర్టుకు సమర్పించింది. విద్యాశాఖ ఫిర్యాదు మేరకు మే 12న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సీబీఐ, దేశవ్యాప్తంగా సోదాలు నిర్వహించి కీలక ఆధారాలు స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం నిందితులంతా జుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

## నేతన్నకు చేయూత ఏది?

**మొదటి పేజీ తరువాయి**

పూర్తిగా విఫలమైందని కేటీఆర్ దుయ్యబట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బోర్డులను రద్దు చేసి, జీఎస్టీ విధించి దెబ్బతీస్తే.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పథకాలను నిలిపివేసి నేతన్నలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కక్షపూరిత వైఖరి వీడి, రద్దు చేసిన పథకాలను తక్షణమే పునరుద్ధరించి నేతన్న కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

## దేవుడా.. వానలు కురిపించు!

**మొదటి పేజీ తరువాయి**

నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగం వైభవంగా జరగనుంది. ఎల్ నినో ప్రభావం నుంచి విముక్తి కలిగి, కృష్ణా-గోదావరి నదులతో పాటు రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపడుతున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు 11 హోమకుండాలలో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. యాగ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ మహా వరుణ యాగాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ తెలిపారు.

## బోనాల పండుగ.. సైబరాబాద్‌లో వైన్స్ బంద్

**మొదటి పేజీ తరువాయి**

ఈ ఆదేశాలు ఆగస్టు 9 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమల్లో ఉంటాయి. కుకట్‌పల్లి, అల్లాపూర్, రాయదుర్గం, జీడిమెట్ల, మేడ్చల్, చందానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని వైన్ షాపులు, కల్లు దుకాణాలు మరియు రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లను మూసివేయాలని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. ప్రజా శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ వెల్లడించారు. అయితే, స్టార్ హోటళ్లు మరియు రిజిస్టర్డ్ క్లబ్బులలోని బార్లకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు లభించింది. తెలంగాణ వ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ పరిసరాల్లో అత్యంత వైభవంగా జరిగే బోనాల ఉత్సవాల దృష్ట్యా ఈ ఆంక్షలు విధించారు. ఇప్పటికే హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కూడా ఇటువంటి ఆంక్షలే అమలులో ఉన్నాయి.

## చిరువ్యాపారులకు చింత లేదు

**మొదటి పేజీ తరువాయి**

ఛార్జీలు విధించే ప్రతిపాదన ఏదీ లేదని పీసీఐ తన పోస్టులో పేర్కొంది. భారతీయులందరూ ఎటువంటి అదనపు రుసుములు లేకుండా తక్షణ డిజిటల్ చెల్లింపులు కొనసాగించవచ్చని భరోసా ఇచ్చింది. అదేవిధంగా, చిన్న వ్యాపారులు సైతం యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించేందుకు ఎటువంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో దాని సుస్థిరత, నిర్వహణ వ్యయాలపై కొంతకాలంగా విస్తృత చర్చ జరుగుతోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరచడం, సైబర్ సెక్యూరిటీని పటిష్ఠం చేయడం, ఆర్థిక మోసాల నివారణ వంటి అంశాలకు అవసరమైన నిధులపై ఈ చర్చలు కేంద్రీకృతమయ్యాయి. ఈ క్రమంలోనే యూపీఐ ఛార్జీలపై వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ పీసీఐ ఈ స్పష్టతనిచ్చింది. బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు, ఎన్‌పీసీఐ, ఆర్‌బీఐ సమన్వయంతో గత దశాబ్ద కాలంగా ఈ చెల్లింపుల వ్యవస్థను నిర్మించాయని గుర్తుచేసింది.

## అవును! చిన్న నోట్లూ ఫేక్ చేస్తున్నారు

**మొదటి పేజీ తరువాయి**

ముఖ్యంగా రూ. 20 నకిలీ నోట్ల గుర్తింపు ఏకంగా 47.4 శాతం మేర పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు అత్యధికంగా చలామణిలో ఉన్న రూ. 500 నకిలీ నోట్లు ఇప్పటికీ అధిక సంఖ్యలోనే పట్టుబడుతున్నాయి. అయితే, రూ. 100, రూ. 50 నకిలీ




నోట్ల సంఖ్యలో కొంత తగ్గుదల కనిపించగా, ఇప్పటికే రద్దయిన రూ. 2000 నకిలీ నోట్ల చలామణి గణనీయంగా క్షీణించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆర్బీఐ అప్రమత్తమైంది. నకిలీ నోట్లను గుర్తించే పద్ధతులపై బ్యాంకుల్లో నగదు నిర్వహణ సిబ్బందికి నిర్దేశిత గడువులోగా శిక్షణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా సరిహద్దు జిల్లాల్లోని బ్రాంచ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. నకిలీ నోట్లను గుర్తించి, స్వాధీనం చేసుకోవడంలో విఫలమైతే, నోటు విలువను బట్టి జరిమానాలు ఉంటాయని హెచ్చరించింది. ఇటీవల దేశంలోని పలు రాష్ట్రాల్లో జరిగిన దాడుల్లో పెద్ద, చిన్న విలువ కలిగిన నకిలీ నోట్లు పట్టుబడగా, స్థానిక నెట్‌వర్క్‌ల ద్వారా వీటిని ముద్రిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నెట్‌వర్క్‌లను అరికట్టేందుకు నిఘాను ముమ్మరం చేసినట్లు దర్యాప్తు సంస్థలు తెలిపాయి.

# ఫార్చ్యూన్ సన్‌ఫ్లవర్‌లో విటమిన్ల లోపం

**మొదటి పేజీ తరువాయి**

నూనెలో ఉండాల్సిన విటమిన్-ఏ, విటమిన్-డి స్థాయిలు నిర్దేశిత పరిమితుల కంటే గణనీయంగా తక్కువగా ఉన్నట్లు తేలింది. దీంతో ఆహార భద్రతా, ప్రమాణాల చట్టం-2006 ప్రకారం, ఈ ఉత్పత్తిని 'నాణ్యతలేనిది'గా అధికారులు వర్గీకరించారు. ఈ ఫలితాలపై సదరు సంస్థ అప్పీల్ చేయడంతో, ఆ నమూనాను మరో రిఫరల్ ల్యాబొరేటరీలో పునఃపరీక్షించారు. రెండోసారి నిర్వహించిన పరీక్షల్లోనూ విటమిన్-డి స్థాయి తక్కువగా ఉన్నట్లు ధ్రువీకరణ కావడంతో ప్రాసిక్యూషన్‌కు అనుమతి లభించింది. ఈ నేపథ్యంలో, గోవాలోని అడ్జుడికేటింగ్ అధికారి కంపెనీపై జరిమానా విధించారు. అయితే, జరిమానా మొత్తాన్ని అధికారులు ఇంకా వెల్లడించలేదు. ఈ అంశంపై ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ స్పందిస్తూ, తమకు ఇంకా అధికారిక ఉత్తర్వుల కాపీ అందలేదని పేర్కొంది. ఇది కేవలం విటమిన్ల స్థాయికి సంబంధించిన అంశమేనని, ఉత్పత్తి భద్రతకు ఎలాంటి ఢోకా లేదని, ఈ నూనె వినియోగానికి పూర్తి సురక్షితమని స్పష్టం చేసింది. నిల్వ చేసే విధానం, కాంతి, కాలపరిమితి వంటి కారణాల వల్ల విటమిన్ల స్థాయి మారే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. ఆర్డర్‌ను సమీక్షించిన అనంతరం తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని, ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు తాము కట్టుబడి ఉన్నామని సంస్థ వివరించింది.



## 24 గంటల్లో విద్యార్థిని ఆచూకీ కనిపెట్టారు

## రూ.5 కోట్ల అంశానికి రూ.54 కోట్ల పెనాల్టీనా?

**అధికారులపై మంత్రులు కోమటిరెడ్డి, వివేక్ ఆగ్రహం**

హైదరాబాద్, ఆగస్టు 7 (ఈవార్తలు): రోడ్డు పనులు చేపట్టే చిన్న కాంట్రాక్టర్లపై మైనింగ్ శాఖ అధికారులు పది రెట్ల వరకు అతిగా పెనాల్టీలు విధించడంపై రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సచివాలయంలో రహదారుల నిర్మాణం, కాంట్రాక్టర్ల ఇబ్బందులపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో వారు మాట్లాడారు. రూ.5 కోట్ల విలువైన అంశానికి ఏకంగా రూ.54 కోట్లు పెనాల్టీ విధించడం అత్యంత దారుణమని, కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి వివేక్‌ను కోమటిరెడ్డి కోరారు. అక్రమ మైనింగ్ చేసేవారిని వదిలేసి, రోడ్ల పనులు చేసే అమాయక కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని మంత్రులు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హ్యామ్ మోడల్ రోడ్ల పనులను వేగవంతం చేసి, 2028 నాటికి రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్లు నిర్మించడమే లక్ష్యమని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మెటల్ పర్మిషన్ల పేరుతో వేధించవద్దని, కాంట్రాక్టర్ల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని మైనింగ్ శాఖ అధికారులను మంత్రి వివేక్ ఆదేశించారు.

## ఎన్‌కౌంటర్ చేస్తామని సజ్జనార్ బెదిరిస్తున్నారు

**ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి సంచలన ఆరోపణలు**

హైదరాబాద్, ఆగస్టు 7 (ఈవార్తలు): తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కోర్టులో సంచలన ఆరోపణలు చేశారు. రెండు రోజుల పోలీస్ కస్టడీ ముగియడంతో అత్తాపూర్ పోలీసులు ఆయనను ఉప్పరపల్లి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టు హాలులోనే ఉదయ్ కృష్ణారెడ్డి బోరున విలపించారు. సైబరాబాద్ సీపీ సజ్జనార్‌పై ఆయన మేజిస్ట్రేట్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విచారణ పేరుతో తనను సీపీ సజ్జనార్ తీవ్రంగా బెదిరించారని, 'నిన్ను ఎన్‌కౌంటర్ చేస్తాం' అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఉదయ్ ఆరోపించారు. న్యాయస్థానానికి సమర్పించిన ఫిర్యాదులో ఉదయ్ కృష్ణారెడ్డి పలు కీలక అంశాలను పేర్కొన్నారు. 'నన్ను సీసీ కెమెరాలు లేని చోటుకు తీసుకెళ్లి విచారించారు. టాస్క్‌ఫోర్స్ ఆఫీసులో ఉంచి తీవ్రంగా హింసించారు' అని వాపోయారు. నిందితుడి ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన మేజిస్ట్రేట్.. సీసీ కెమెరాలు లేని చోట విచారణ ఎలా జరుపుతారంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రెండు రోజుల్లోగా పూర్తి వివరణ ఇవ్వాలంటూ అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌కు కోర్టు షోకాజు నోటీసులు జారీ చేసింది.

## ఐఅండ్ పీఆర్ కార్యాలయంలో ఘనంగా బోనాలు

హైదరాబాద్, ఆగస్టు 7 (ఈవార్తలు): సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్‌లోని సమాచార భవన్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సమాచార శాఖ ఉద్యోగుల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఉత్సవ ఊరేగింపు, బోనాల సమర్పణ, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ శ్రీ ముకుంద్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన ఉత్సవ ఊరేగింపులో డప్పు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలు, సాంప్రదాయ కళారూపాల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ సంచాలకులు ఎల్.ఎల్.ఆర్. కిషోర్ బాబు, అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్, మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, జాయింట్ డైరెక్టర్లు డి. శ్రీనివాస్, కె. వెంకటరమణ, సి.ఐ.ఈ. రాధాకిషన్, డిప్యూటీ డైరెక్టర్లు సి. రాజారెడ్డి, ఆర్.ఐ.ఈ. జయ రామ్మూర్తి, సహాయ సంచాలకులు సత్యనారాయణ రెడ్డి, బిమల్ దేవ్, డిప్యూటీ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ నర్సింహా గౌడ్, అకౌంట్స్ ఆఫీసర్లు పద్మ, టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, టీజీఓ అధ్యక్షుడు యేలూరి శ్రీనివాసరావు, టీఎన్‌జీవోస్ నాయకులు అనిల్, జితేందర్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో మధ్యప్రదేశ్‌కు వెళ్లిన బాలిక

**'ధర్పాన్' యాప్‌తో గుర్తించిన పోలీసులు**

జగిత్యాల, ఆగస్టు 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో అదృశ్యమైన ఓ మోడల్ స్కూల్ విద్యార్థిని ఆచూకీని పోలీసులు 24 గంటల్లో గుర్తించారు. కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని పాఠశాల నుంచి జగిత్యాల బస్టాండ్‌కు ఆటోలో చేరుకుని, అక్కడి నుంచి మంచిర్యాలకు వెళ్లి రైలులో మధ్యప్రదేశ్‌లోని బలియార్‌కు చేరుకుంది. మధ్యప్రదేశ్ రైల్వే పోలీసులు సమాచారం ఇవ్వడంతో జగిత్యాల పోలీసులు వెంటనే విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ప్రస్తుతం విద్యార్థిని తన పెద్దనాన్న వద్ద సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. 'ధర్పాన్' పోలీస్ యాప్ సాయంతో 24 గంటల్లోనే విద్యార్థిని ఆచూకీని గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. తన స్నేహితురాలు మరో పాఠశాలలో చేరడంతో తనను ఎవరూ పట్టించుకోవడం లేదనే మనస్తాపంతో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు విచారణలో తేలిందని ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు. విద్యార్థిని క్షేమంగా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## కోరుట్ల ఎస్సైగా శ్యామ్‌రాజ్ బాధ్యతలు

కోరుట్ల, ఆగస్టు 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్ల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా శ్యామ్‌రాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్సై శ్యామ్‌రాజ్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణ, చట్టాల అమలులో నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు ప్రజలు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## కేసులకు భయపడం: బాల్క సుమన్

మంచిర్యాల, ఆగస్టు 7 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల ఘటనపై నమోదైన కేసు విచారణ నిమిత్తం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి ఆయన ఈరోజు మంచిర్యాల జిల్లా కోర్టుకు హాజరయ్యారు. కేసును విచారించిన న్యాయస్థానం తదుపరి విచారణను సెప్టెంబర్ 25కు వాయిదా వేసింది. అనంతరం మీడియాతో మాట్లాడిన బాల్క సుమన్... క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ వచ్చినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ అక్రమ మార్గాల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకోవడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లకు కోట్ల రూపాయలు, బ్లాంక్ చెక్కులు చూపించినా లొంగకపోవడంతోనే తమపై కక్షపూరితంగా తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులకు, బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలకు ఒక చట్టం, అధికార పార్టీ నేతలకు మరొక చట్టం అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు అయ్యే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

# 'చేనేత'కు రూ.980 కోట్లు

**మంత్రి తుమ్మల వెల్లడి.. పీపుల్స్ ప్లాజాలో వస్త్ర ప్రదర్శన ప్రారంభం**



హైదరాబాద్, ఆగస్టు 7 (ఈవార్తలు): చేనేత కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. భారతీయ సంస్కృతికి, వారసత్వానికి చేనేత ప్రతీక అని, గద్వాల, పోచంపల్లి, నారాయణపేట వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నకు, నేతన్నకు సమాన ప్రాధాన్యతను ఇస్తోందని మంత్రి తెలిపారు. చేనేత రంగానికి ఇప్పటివరకు రూ.980 కోట్లు విడుదల చేశామని, అందులో చేనేత రుణమాఫీ కింద రూ.49.27 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. 'నేతన్న భరోసా' ద్వారా ఏడాదికి రూ.18,000 ఆర్థిక సాయం, 'నేతన్నకు భద్రత' కింద రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని, ఐఐహెచ్‌టీ ద్వారా యువతకు ఆధునిక నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికలను నిర్వహిస్తామని, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# జీవితాంతం చిప్పకూడే

**ఐఏఎస్ సందీప్ కుమార్‌పై హైకోర్టు ఆగ్రహం**

**కంటోన్మెంట్ బోర్డు బకాయిలపై కీలక వ్యాఖ్యలు**



హైదరాబాద్, ఆగస్టు 7 (ఈవార్తలు): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు కేటాయించాల్సిన బకాయి నిధుల విడుదల వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు శుక్రవారం అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. కంటోన్మెంట్ బోర్డుకు రావలసిన దాదాపు రూ. 33 కోట్ల స్టాంప్ డ్యూటీ సర్‌ఛార్జి బకాయిలను విడుదల చేయకపోవడంతో జే. రామకృష్ణ గతంలో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఉత్తర్వులపై కౌంటర్ దాఖలు చేయడానికి జులై 10వ తేదీన విచారణకు హాజరుకాకపోవడంతో.. సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్ సుల్తానియాపై హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఆ ఆదేశాల మేరకు తాజాగా ఆయన స్వయంగా విచారణకు హాజరయ్యారు. ఈ కేసు విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు జస్టిస్ నగేష్ భీమపాక నేతృత్వంలోని బెంచ్ అధికారుల వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉన్నతాధికారులను పదే పదే బోనులో నిలబెట్టడం తమకు ఎంతగానో బాధ కలిగిస్తోందని కోర్టు.. వ్యాఖ్యానించారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో ఆయనపై అనేక కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు అయ్యాయని గుర్తుచేశారు. ఆ పిటిషన్లు అన్నింటిలో గనక శిక్ష విధిస్తే.. ఆయన జీవిత కాలం జైల్లోనే గడపాల్సి వస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. పాలనాపరంగా ప్రభుత్వాలు చేసే తప్పులు, నిర్లక్ష్యం కారణంగానే బాధ్యతాయుతమైన అధికారులు ఇలాంటి చిక్కుల్లో పడుతున్నారని జస్టిస్ నగేష్ భీమపాక అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన అధికారి సందీప్ కుమార్ సుల్తానియా.. కంటోన్మెంట్ బోర్డుకు ఇప్పటికే రూ. 25 కోట్ల నిధులను విడుదల చేశామని చెప్పారు. మిగిలిన బకాయిలను కూడా విడతల వారీగా త్వరలోనే చెల్లిస్తామని ధర్మాసనానికి వివరణ ఇచ్చారు. ఈ సమాధానంపై సంతృప్తి వ్యక్తం చేసిన హైకోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది.

# కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలి

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ డిమాండ్**



న్యూఢిల్లీ: భారత కరెన్సీ నోట్లపై రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్ర పటాన్ని ముద్రించాలనే డిమాండ్‌కు తెలంగాణ ప్రభుత్వం నుంచి బలమైన మద్దతు లభించేలా చేస్తానని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తేల్చి చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. జంతర్‌మంతర్‌లో ' కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి' చేపట్టిన శాంతియుత ధర్నా కార్యక్రమానికి హాజరై సంఘీభావం తెలిపారు. జంతర్‌మంతర్ ధర్నా వేదికపై మాట్లాడిన మంత్రి అడ్లూరి.. కరెన్సీ నోట్లపై అంబేద్కర్ బొమ్మను ముద్రించడం కోసం సుదీర్ఘ కాలంగా పోరాటం జరుగుతోందని గుర్తుచేశారు. కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జరిపోతుల పరుశురాం నాయకత్వంలో ఇప్పటివరకు దాదాపు 26 పార్లమెంట్ సమావేశాల సందర్భాల్లో నిరసనలు, ధర్నాలు నిర్వహించారని తెలిపారు. అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కుల కారణంగానే ఈరోజు తనలాంటి దళిత బిడ్డ రాష్ట్రానికి మంత్రి కాగలిగాడని ఆయన ఎమోషనల్ అయ్యారు. అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదని.. ఆయన ప్రపంచ ప్రఖ్యాత ఆర్థికవేత్త అని మంత్రి అడ్లూరి వెల్లడించారు. దేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఏర్పాటుకు ముందు జరిగిన ద్రవ్య విధాన చర్చల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన సూచనలు, ఆర్థిక ఆలోచనలు అత్యంత కీలక పాత్ర పోషించాయని తెలిపారు. మహాత్మా గాంధీకి దేశంలో ఇచ్చే అత్యున్నత గౌరవంతో పాటు.. దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది వేసిన అంబేద్కర్ రూపాన్ని కరెన్సీ నోట్లపై ముద్రించడం ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం పట్ల భారత్ నిబద్ధత ప్రపంచానికి చాటిచెప్పినట్లవుతుందని అడ్లూరి లక్ష్మణ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇక కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటోను ముద్రించాలనే ఈ అంశం ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకుని.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రివర్గం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వానికి, ఆర్బీఐకి అధికారికంగా విజ్ఞప్తి పంపేలా తనవంతు కృషి చేస్తానని ప్రకటించారు. ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవితోపాటు.. రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య.. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం పాల్గొని తమ మద్దతు తెలియజేశారు.

## డీఎస్సీపై సీబీఐ విచారణకు

# భయమెందుకు?: జగన్

తాడేపల్లి, ఆగస్టు 7 (ఈవార్తలు): డీఎస్సీ-2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్ర బాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజార్చుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు జగన్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ విజయవాడలో శాంతి యుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారిపై అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడి చేసి, శిబిరాన్ని ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లెదుటే ఈ దౌర్జన్యం జరిగిందని, టెంట్లు పీకేసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగులపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని పేర్కొన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులు కేవలం విజయవాడకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా దీక్షా శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ తెలిపారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల వరకు పలుచోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేసి, నాయకులను నిర్బంధించారని వివరించారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని మండిపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెబుతున్నప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు.

## 11 లోపు కృష్ణా నీళ్లివ్వకపోతే నార్లాపూర్ ముట్టడి

హైదరాబాద్, ఆగస్టు 7 (ఈవార్తలు): జూరాల ప్రాజెక్టు పరిధిలోని భీమా ఫేజ్-1, 2, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ లిఫ్టులతో పాటు కేఎల్ఐ కింద ఉన్న పంపులను తక్షణమే ప్రారంభించి పాలమూరు రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 11వ తేదీలోపు పంపులను ఆన్ చేయకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి భారీ సంఖ్యలో రైతులతో నార్లాపూర్ ప్రాజెక్టును ముట్టడిస్తామని హెచ్చరించారు. కృష్ణా నదికి ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తున్నప్పటికీ, నీళ్లు లేవంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలమూరు బిడ్డనని చెప్పుకుంటూనే ఏపీకి నీళ్లు తరలించేందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు రేవంత్ సహకరిస్తున్నారని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తిగా పక్కన పెట్టేశారని విమర్శించిన ఆయన... కర్ణాటక నుంచి వచ్చే వృథా నీటితోనే డిసెంబర్ వరకు జూరాలకు పుష్కలంగా నీరు అందుతుందని, వెంటనే ఎత్తిపోతల పంపులు ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

## తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం.. ఒకరి మృతి

తిరుమల, ఆగస్టు 7 (ఈవార్తలు): తిరుమలలో విషాదం నెలకొంది. శ్రీవారి దర్శనం అనంతరం తిరిగి వెళుతున్న భక్తుల కారు అదుపుతప్పి లోయలో పడటంతో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందగా, మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం శుక్రవారం తిరుమల నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్ రోడ్డులో చోటుచేసుకుంది. బెంగళూరులోని గొట్టిగెరెకు చెందిన సతీష్ కుమార్ (72) తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. స్వామివారి దర్శనం ముగించుకుని కారులో తిరుగు ప్రయాణమైన క్రమంలో, 22వ హెయిర్‌పిన్ బెండ్ వద్ద వాహనం అదుపుతప్పింది. వేగంగా వెళుతూ రక్షణ గోడను ఢీకొట్టిన కారు, సుమారు 15 అడుగుల లోతులో ఉన్న లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో సతీష్ కుమార్ కుమారుడు సాయి శ్రీనివాస్, కుమార్తె సింధు ఉడత్, మనవరాళ్లు తియా, నైరాలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్నాయి.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఒంటరి పోరే

**ఎవరితోనూ పొత్తులు ఉండవు.. టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు**

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 7 (ఈవార్తలు): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ విభాగం అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి పొత్తులు లేకుండానే బరిలోకి దిగుతామని ఆయన ప్రకటించారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో భేటీ అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో బీజేపీ ఎవరితోనూ పొత్తులు పెట్టుకోదు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్ర పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, కేవలం అభిప్రాయ భేదాలు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. సరైన సమయం చూసి పలువురు కీలక నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వంలో పెరుగుతున్న అవినీతిపై పోరాడాలని, అధికారంలోకి వచ్చేందుకు పక్కా రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని జాతీయ నాయకత్వం తమకు సూచించినట్లు రామచందర్ రావు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ఆరు గ్యారెంటీల అమలు తీరును ప్రజల్లోకి బలంగా తీసుకెళతామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు. అన్ని మండలాల్లో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో 'డబుల్ ఇంజిన్ సర్కార్'ను ఏర్పాటు చేయడమే తమ అంతిమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలు రాష్ట్రంలో పార్టీ బలాన్ని నిరూపించుకోవడానికి ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

## ఆమ్రపాలికి నో పోస్టింగ్

**ఏపీలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ**

అమరావతి, ఆగస్టు 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం భారీస్థాయిలో ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. 22 మంది ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖ స్పెషల్ సీఎస్‌గా శ్యామలరావును నియమించారు. రవాణాశాఖ కార్యదర్శిగా కోన శశిధర్‌ను బదిలీ చేశారు. టూరిజం ఎండీగా రవి సుభాష్‌ను నియమించిన ప్రభుత్వం.. ఐఏఎస్ ఆఫీసర్ ఆమ్రపాలిని జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆర్టీసీ జాయింట్ ఎండీగా శివప్రసాద్‌ను నియమించారు. పురావస్తుశాఖ కమిషనర్‌గా ముత్యాలరాజును నియమించారు. వీఎంఆర్డీఏ కమిషనర్‌గా ప్రఖర్ జైన్, టీటీడీ జేఈవోగా ప్రభల గోపీనాథ్‌ను నియమించారు. జీఏడీ, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (సర్వీసెస్ అండ్ హెచ్ఆర్ఎం)గా ఉన్న షంషేర్ సింగ్ రావత్‌ను.. టూరిజం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బదిలీ చేశారు. ఏపీఎస్ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా శివప్రసాద్‌ను నియమించారు. ఏపీటీడీసీ ఎండీగా ఉన్న ఆమ్రపాలి కాటాను ఆ పదవి నుంచి బదిలీ చేసిన ఏపీ ప్రభుత్వం.. జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించింది. సురేష్ కుమార్‌ను గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారిగా నియమించారు. నారాయణ భరత్ గుప్తాను గోదావరి పుష్కరాల జాయింట్ స్పెషల్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. కేవీఎన్ చక్రధర బాబును హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌గా, నేషనల్ హెల్త్ మిషన్ ఎండీగా బదిలీ చేశారు. హెప్సిబా రాణిని హౌసింగ్ డిపార్టుమెంట్ స్పెషల్ సెక్రటరీగా నియమించారు. పి. అరుణ్ బాబును డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. గీతాంజలి శర్మను ఆర్టీజీఎస్ సీఈవోగా నియమించారు.

# సమస్య చెప్పగానే చర్య

**ప్రజావినతి.. పాలనా స్పందన.. జగిత్యాల కౌన్సిలర్ అనీస్ ఖుతేజ (అహ్మద్) వినతికి తక్షణ స్పందన**



జగిత్యాల టౌన్, ఆగస్టు 7 (ఈవార్తలు): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జగిత్యాల పట్టణంలోని ఓస్మాన్‌పురా ఖబరస్తాన్‌లో పలు సమాధులు దెబ్బతిని, సందర్శకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో 46వ వార్డు కౌన్సిలర్ అనీస్ ఖుతేజ అహ్మద్, కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్ వెంటనే స్పందించి సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధుల విజ్ఞప్తిపై మున్సిపల్ యంత్రాంగం ఆలస్యం చేయకుండా స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టడం స్థానికుల ప్రశంసలు అందుకుంది. మున్సిపల్ ఏఈ అశోక్, వర్క్ ఇన్స్పెక్టర్లు రంజిత్, మోహన్, వార్డు ఆఫీసర్ రాజేందర్‌లతో కలిసి అధికారులు ఓస్మాన్‌పురా ఖబరస్తాన్‌ను సందర్శించి, భారీ వర్షాలకు దెబ్బతిన్న సమాధులను పరిశీలించారు. పరిస్థితిని అంచనా వేసిన అనంతరం వెంటనే మొరం పనులు ప్రారంభించి, దెబ్బతిన్న ప్రాంతాలను సమతలీకరించే చర్యలకు శ్రీకారం చుట్టారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మరమ్మతులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అనీస్ ఖుతేజ అహ్మద్, కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్ ఖబరస్తాన్‌లో నెలకొన్న ఇతర సమస్యలను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో సందర్శకులకు ఇబ్బందులు తలెత్తకుండా కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు ఖబరస్తాన్‌లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు, రక్షణ చర్యలు, లైటింగ్ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అనీస్ ఖుతేజ అహ్మద్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్ మాట్లాడుతూ, ఖబరస్తాన్‌కు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించే వరకు ప్రజాప్రతినిధులుగా తమ ప్రయత్నం కొనసాగుతుందని పేర్కొన్నారు. స్థానికులు సైతం సమస్యపై తక్షణ స్పందన చూపిన మున్సిపల్ యంత్రాంగం, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా

**వేములవాడ బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పిలుపు**



వేములవాడ అర్బన్, ఆగస్టు 7 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని పద్మశాలి భవన్‌లో పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా పార్టీ శాఖల ఆదేశాల మేరకు నెలవారీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని పెంపొందించాలని, ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర నాయకుడు లింగంపల్లి శంకర్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రతి భారతీయుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందించేలా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి బీజేపీ కార్యకర్త సైనికుడి స్ఫూర్తితో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. వేములవాడ పట్టణంలో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేస్తూ భారీగా తిరంగా యాత్ర నిర్వహించాలని అన్నారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయ బాధ్యుడు గొల్లపెల్లి నీరజ్ నేతృత్వంలోని బృందం సామాజిక మాధ్యమాల వినియోగంపై కార్యకర్తలకు అవగాహన కల్పించింది. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు కోలా ఇష్టస్వామి, జిల్లా నాయకులు రేగుల మల్లికార్జున్, పిన్నింటి హనుమాన్లు, వాసం మల్లేశం, గుడిసె మనోజ్, నామాల శేఖర్, పట్టణ కమిటీ సభ్యులు వివేక్‌రెడ్డి, కటకం శ్రీనివాస్, జవ్వాజి శేఖర్, సగ్గు రాహుల్, లాలా శేఖర్, నేరెళ్ల కిరణ్, సాయికృష్ణ, అన్నం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ప్రభుత్వం తీరుతో రైతులు ఆగం

**విద్యుత్తు కోతలు, ఎరువుల కొరతతో ఇబ్బందులు**

**మాజీమంత్రి జీవన్‌రెడ్డి విమర్శలు**

జగిత్యాల, ఆగస్టు 7 (ఈవార్తలు): ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తగిన ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం సారంగాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురవడం వల్ల రైతులకు కొంత ఊరట లభించినప్పటికీ, ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందడం లేదన్నారు. వ్యవసాయానికి ప్రస్తుతం విద్యుత్, ఎరువుల కొరత ప్రధాన సమస్యలుగా మారాయని చెప్పారు. కేసీఆర్ హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించగా, ప్రస్తుతం విద్యుత్ కోతలు పెరిగి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. శ్రీశైలం నుంచి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేయకపోవడం వల్ల రాష్ట్రంలో విద్యుత్ కొరత ఏర్పడుతోందన్నారు. డీఏపీ, యూరియా ఎరువుల ధరలు పెరగడంతో రైతులపై అదనపు భారం పడుతోందని, ఎరువుల కొనుగోలుకు యాప్‌ను తప్పనిసరి చేయడం వల్ల రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్, ఎరువులను సమృద్ధిగా అందించి, రైతులపై ఉన్న ఆంక్షలను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# దళిత సర్పంచ్‌కు అవమానంపై అంబేద్కర్ సంఘం ఆగ్రహం

మల్యాల, ఆగస్టు 7 (ఈవార్తలు): గంగాధర మండలం నారాయణపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో దళిత సర్పంచ్‌ను అవమానించిన ఘటనను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సంఘం మల్యాల మండల శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు పూడూరు గంగస్వామి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను కులం పేరుతో అవమానించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. దళిత సర్పంచ్‌ను కించపరిచిన వారిపై సంబంధిత అధికారులు వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఏ కులానికి చెందిన ప్రజాప్రతినిధినైనా గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. దళితులపై సామాజికంగా, రాజకీయంగా దాడులు, అవమానాలు కొనసాగితే అంబేద్కర్ సంఘం సహించబోదని హెచ్చరించారు. అవసరమైతే బాధితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముద్దుద్దమల్ల స్వామి, శనిగారపు తిరుపతి, ఆకుల బాబయ్య, సిద్ధంకి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## 12న ఘనంగా తిరంగా యాత్ర: బత్తుల

మల్యాల, ఆగస్టు 7 (ఈవార్తలు): మల్యాల మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర విజయవంతంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ ఎస్సీ మోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బత్తుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఆగస్టు 9, 10 తేదీల్లో ప్రతి ఇంటికీ జాతీయ పతాకాలను పంపిణీ చేయాలని, ఆగస్టు 12న నిర్వహించనున్న తిరంగా యాత్రను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్వాపూర్‌లో నకిలీ ఇంటి పన్ను రసీదుల వ్యవహారం

**ఇద్దరు అరెస్ట్.. మరో నిందితుడు పరారీలో**

మల్యాల, ఆగస్టు 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం సర్వాపూర్ గ్రామంలో నకిలీ గ్రామపంచాయతీ ఇంటి పన్ను రసీదులు తయారు చేసిన ఘటనలో పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి న్యాయ రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు పరారీలో ఉండగా, అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మండల పంచాయతీ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్యాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో ఆకుల నగేష్ (ఏ-1), బాసోజీ అనిల్ (ఏ-2), అరుణ్ (ఏ-3) కలిసి ప్రభుత్వ గ్రామపంచాయతీ ఇంటి పన్ను రసీదులను నకిలీగా తయారు చేసినట్లు గుర్తించారు. అలాగే ప్రభుత్వ అధికారుల సంతకాలు, అధికారిక రబ్బరు ముద్రలు, ముద్రలను అక్రమంగా వినియోగించి నకిలీ ప్రభుత్వ రసీదులను రూపొందించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ఆకుల నాగేష్, బసోజి అనిల్‌ను దర్యాప్తు అధికారి, మల్యాల ఎస్ఐ ఎస్. సందీప్ అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా.. న్యాయస్థానం వారిని రిమాండ్‌కు పంపింది. మరో నిందితుడు అరుణ్ పరారీలో ఉండటంతో అతని కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎస్. సందీప్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పత్రాలు, ధ్రువపత్రాలు, రసీదులను నకిలీగా తయారు చేయడం లేదా వాటిని వినియోగించడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## అంబేద్కర్ అభయహస్తం అమలు చేయాలి

**బీజేపీ నేత మామిడిపల్లి ప్రసాద్ డిమాండ్**



జగిత్యాల, ఆగస్టు 7 (ఈవార్తలు): కరెన్సీ నోట్లపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రాన్ని ముద్రించాలని డిమాండ్ చేస్తున్న ఉద్యమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మద్దతు తెలపడం స్వాగతించదగ్గ పరిణామమని బీజేపీ జగిత్యాల జిల్లా నాయకుడు మామిడిపల్లి ప్రసాద్ అన్నారు. అయితే, కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో పొందుపరిచిన అంబేద్కర్ అభయహస్తం పథకం అమలుపై కూడా మంత్రి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి దళిత కుటుంబానికి రూ. 12 లక్షలు అందజేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. దళితుల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, అలాగే కరెన్సీ నోట్లపై అంబేద్కర్ చిత్రాన్ని ముద్రించే ఉద్యమానికి పూర్తి మద్దతు ఇవ్వాలని మామిడిపల్లి ప్రసాద్ కోరారు.

# చేనేత కార్మికులకు ఏసీఎస్ రాజు సన్మానం



జగిత్యాల, ఆగస్టు 7 (ఈవార్తలు): జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని చేనేత సహకార సంఘంలో పనిచేస్తున్న చేనేత కార్మికులను భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముదుగంటి రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సాంస్కృతిక వారసత్వాన్ని చేనేత కార్మికులు తమ కళానైపుణ్యంతో పరిరక్షిస్తున్నారని కొనియాడారు. స్వదేశీ ఉద్యమం నుంచి చేనేత రంగానికి ప్రత్యేక గుర్తింపు లభించిందని, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వస్త్రాలను రూపొందించిన ఘనత మన నేతన్నలదేనని అన్నారు. ప్రస్తుతం ముడి సరుకుల ధరలు పెరగడం, గిట్టుబాటు ధరలు లేకపోవడం, ఉపాధి అవకాశాలు తగ్గడం వల్ల చేనేత కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం అందించి, కార్మికులకు పెన్షన్, గిట్టుబాటు ధర, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం బాధ్యులు ఆడెపు రాజేశ్వర్, పద్మశాలి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి చిలుక రాజన్న, వేముల దేవరాజం, గాదాసు భూమన్న, నరేందుల శ్రీనివాస్, కొత్తకొండ బాలన్నతో పాటు పలువురు నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# సివిల్స్ ఉచిత శిక్షణ దరఖాస్తు గడువును పెంచాలి

**మూడు రోజులుగా మొరాయించిన వెబ్‌సైట్**

**(దూడం శ్రీశైలం-ఫ్రీలాన్స్ జర్నలిస్టు)**

బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కోసం ఇవ్వబడిన సివిల్స్-2027 దరఖాస్తు గడువును పొడిగించాలని అభ్యర్థులు కోరుతున్నారు. గత మూడు రోజులుగా అధికారిక వెబ్‌సైట్ టీజీబీసీస్టడీసర్కిల్స్.సీజీజీ.జీఓవీ.ఇన్ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని అభ్యర్థులు వాపోతున్నారు. సర్వర్ సమస్యల కారణంగా ఒక్క దరఖాస్తు పూర్తి కావడానికి దాదాపు నాలుగు గంటల సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం (ఆఖరు తేది అయిన ఆగస్టు 7న) వెబ్‌సైట్ పూర్తిగా క్లోజ్ కావడంతో ఆన్‌లైన్ తెరుచుకోలేదు. దీంతో ఉదయం నుండి ఆన్‌లైన్ సెంటర్ల చుట్టూ ప్రదక్షిణ చేసిన వేలాది మంది నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేక నిరాశతో వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. వెబ్‌సైట్ సాంకేతిక లోపాల కారణంగానే అనేక మంది అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. కావున, అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు స్పందించి దరఖాస్తు గడువును మరో రెండు, మూడు రోజులు పొడిగించాలని విద్యార్థులు మరియు అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## మాజీ సైనికుడికి భోగ శ్రావణి ఘన సన్మానం

జగిత్యాల, ఆగస్టు 7 (ఈవార్తలు): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా--తిరంగా యాత్ర' కార్యక్రమంలో భాగంగా మాజీ సైనికుడు దూరిశెట్టి కిరణ్‌కుమార్‌ను బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. భోగ శ్రావణి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డా. భోగ శ్రావణి మాట్లాడుతూ.. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు భారత సైనికులు చేస్తున్న త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. జగిత్యాలకు చెందిన దూరిశెట్టి కిరణ్‌కుమార్ భారత త్రివిధ దళాల్లో సుమారు 19 సంవత్సరాలు సేవలందించారని తెలిపారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొని తీవ్రంగా గాయపడి ఎడమ కన్ను కోల్పోయినా దేశసేవ పట్ల అంకితభావంతో విధులు నిర్వర్తించడం ప్రతి భారతీయుడికి ఆదర్శమని కొనియాడారు. వీర జవాన్ల సేవలను సమాజం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని, వారి త్యాగస్ఫూర్తి యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, కౌన్సిలర్ నిమ్మల నాగరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.




## రాంనూర్ పంచాయతీ నిధులపై విచారణ పూర్తి

వెల్గటూర్, ఆగస్టు 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం రాంనూర్ గ్రామపంచాయతీ సాధారణ, పీఎఫ్, ఎంఎస్ నిధుల వినియోగంపై ప్రజావాణిలో అందిన ఫిర్యాదు మేరకు చేపట్టిన విచారణ ముగిసింది. గ్రామపంచాయతీ కార్యాలయంలో గొల్లపల్లి మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) ప్రదీప్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అయిత తిరుపతి, ఉపసర్పంచ్ ఎంబడి మహేష్, అప్పటి పంచాయతీ కార్యదర్శి అంజిత్‌కుమార్, ప్రస్తుత ఇన్‌చార్జి కార్యదర్శి మల్లేష్ హాజరై తమ వివరణలను అధికారులకు సమర్పించారు. విచారణ నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఎంపీవో ప్రదీప్ తెలిపారు.

# మహిళపై అత్యాచారం.. నలుగురి అరెస్టు

**వీడియో తీసి బ్లాక్‌మెయిల్.. ఇద్దరు రౌడీ షీటర్లతో పాటు మరో ఇద్దరికి రిమాండ్**




మల్యాల, ఆగస్టు 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూకపల్లి గ్రామ శివారులోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మహిళపై అత్యాచారం చేసి, వీడియోతో బ్లాక్‌మెయిల్ చేసిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వివరాలను మల్యాల సీఐ ఎం. రాజ్‌కుమార్ వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన 34 ఏళ్ల మహిళ ఈ నెల 3న పరిచయస్తురాలి ఇంటికి వెళ్లగా, రాజారం గ్రామానికి చెందిన శివరాత్రి నరేష్, గుర్రం శ్రీకాంత్, గుర్రం అంజయ్య, మారవేని మల్లేశ్ ఇన్నోవా కారులో అక్కడికి చేరుకున్నారు. నరేష్, శ్రీకాంత్ గదిలోకి ప్రవేశించి మహిళ వ్యక్తిగత క్షణాలను వీడియో తీశారని, మరో ఇద్దరు బయట కాపలా కాశారని తెలిపారు. అనంతరం మహిళను బెదిరించి అత్యాచారానికి పాల్పడటమే కాకుండా, వీడియోను పంపించి బ్లాక్‌మెయిల్ చేస్తూ వేధింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గురువారం నిందితులను అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితులు ప్రయాణించిన ఇన్నోవా కారు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ప్రధాన నిందితులు నరేష్, శ్రీకాంత్‌లపై ఇప్పటికే రౌడీ షీట్లు ఉండగా, మిగతా ఇద్దరిపై కూడా పలు కేసులు నమోదైనట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని సీఐ తెలిపారు.



## తల్లిపాలతో శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

తల్లిపాలతో శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు అందించడం అత్యంత కీలకమని ఆర్టస్ కాలేజీ అండ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కరస్పాండెంట్ తకాసి స్వాతి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కాలేజీ ఆధ్వర్యంలో తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేస్తూ ప్లకార్డులతో కూడిన ర్యాలీ, స్కిట్ ప్రదర్శన, విద్యార్థులకు వ్యాస రచన, పోస్టర్ తయారీ, ప్రసంగ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు అందించాలని, దీనివల్ల బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేందుకు అవకాశం ఉందన్నారు. తల్లిపాలలో శిశువుకు కావాల్సిన పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయన్నారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము కేన్సర్, అండాశయ ముఖద్వార కేన్సర్ వంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు అవకాశం ఉందన్నారు. కొంత మంది అపోహలు, ఇతర కారణాలతో బిడ్డకు తల్లిపాలు ఇచ్చేందుకు దూరంగా ఉంటారన్నారు. ఈ తరహా ఆలోచనలు మంచివి కావన్నారు. బిడ్డకు తల్లిపాలు చేసే మేలు మరేవీ చేయవన్నారు. కాలేజీ ఆధ్వర్యంలో గడిచిన వారం రోజులు నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గ్రేసి, కాలేజీ ఫ్యాకల్టీ గ్రేసీ నంద్, కె శ్రావణి, జే హన్నా, అదితి, సింసాన్, పావని, ఝాన్సీతోపాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## నేతన్నలను ఆదుకోవడంలో సర్కారు విఫలం: దావ వసంత

జగిత్యాల, ఆగస్టు 7 (ఈవార్తలు): చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ విమర్శించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆమె నేతన్నలకు శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ హయాంలో చేనేత రంగానికి అమలైన సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ప్రోత్సాహం ప్రస్తుతం లేకపోవడంతో నేతన్నల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆమె అన్నారు. ప్రభుత్వ ఆర్డర్లను చేనేత సహకార సంఘాలకు కాకుండా ప్రైవేట్ సంస్థలకు కేటాయించడం వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ విధించడం, హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డులను రద్దు చేయడం, పలు సంక్షేమ పథకాలను నిలిపివేయడం వల్ల చేనేత రంగం సంక్షోభంలోకి వెళ్లిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలను పునరుద్ధరించి, ప్రభుత్వ ఆర్డర్లను సహకార సంఘాలకే కేటాయించాలని, కేంద్ర ప్రభుత్వం చేనేతపై జీఎస్టిని రద్దు చేసి నిలిపివేసిన సంక్షేమ పథకాలను పునఃప్రారంభించాలని ఆమె డిమాండ్ చేశారు. నేతన్నలను ఆదుకుంటేనే చేనేత రంగం, భారతీయ సంప్రదాయం పరిరక్షించబడుతుందని దావ వసంత సురేష్ పేర్కొన్నారు.

## ఏఎస్సైగా గంగాధర్‌కు ఎమ్మెల్యే సంజయ్ అభినందనలు

జగిత్యాల, ఆగస్టు 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఇంటెలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వావిలాల గంగాధర్ ఏఎస్ఐగా పదోన్నతి పొందిన సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగాధర్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, పదోన్నతి మరింత బాధ్యతతో విధులు నిర్వర్తించేందుకు దోహదపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గిరి నాగభూషణం, గట్టు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# స్వలింగ సంపర్కుల సహజీవనానికి ఓకే

## పెళ్లికి మాత్రం నో: ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్

ముంబై: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భగవత్ స్వలింగ సంపర్కుల సంబంధాలు, రిజర్వేషన్లు, మహిళల పాత్ర వంటి పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. ముంబైలో జరిగిన ఇండియా ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు యునైట్ నేషన్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, స్వలింగ సంపర్కుల సహజీవనానికి చట్టపరమైన గుర్తింపు ఉండాలని, అయితే వారి బంధాన్ని వివాహంగా గుర్తించడాన్ని తాను వ్యతిరేకిస్తున్నానని తెలిపారు. స్వలింగ సంపర్కులు కూడా సమాజంలో భాగమేనని, వారికి తగిన స్థానం కల్పించాలని భగవత్ అన్నారు. వారి సహజీవనం కోసం స్పష్టమైన నియమాలు, చట్టాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, దీనిని వివాహ వ్యవస్థతో ముడిపెట్టవద్దని స్పష్టం చేశారు. "భారతీయ సమాజంలో వివాహం అంటే కేవలం ఇద్దరు వ్యక్తులు కలిసి జీవించడం మాత్రమే కాదు. మంచి సంతానాన్ని పెంచి, బలమైన సమాజాన్ని నిర్మించేందుకు ఏర్పాటు చేసుకున్న ఒక పవిత్రమైన వ్యవస్థ. ప్రస్తుతం ఉన్న ఈ విధానాన్ని మార్చడం వల్ల అనవసర సంఘర్షణలు తలెత్తుతాయి. అందుకే స్వలింగ సంపర్కుల కలయికను వివాహంగా పరిగణించకూడదు" అని ఆయన వివరించారు. ఇతర అంశాలపై మాట్లాడుతూ, సామాజిక వివక్ష ఉన్నంత కాలం దేశంలో రిజర్వేషన్లు అవసరమేనని భగవత్ పునరుద్ఘాటించారు. దీనిని రాజకీయ అంశంగా




మార్చవద్దని హితవు పలికారు. సరిదిద్దే చర్యలను నిజాయతీగా అమలు చేస్తే, భవిష్యత్తులో రిజర్వేషన్ల అవసరం లేకుండా పోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చైనా, పాకిస్థాన్‌తో సంబంధాల గురించి ప్రస్తావిస్తూ, సంఘర్షణల సమయంలో ప్రజలు ప్రభుత్వం చెప్పిన దానినే అనుసరించాలని సూచించారు. శాంతి, సామరస్యంతో మెలగడమే భారతీయ పరిష్కారమని, శాశ్వత ద్వేషం ఉండకూడదని, ఎందుకంటే మానవత్వం ఒక్కటేనని అన్నారు. సంఘ్‌లో మహిళల పాత్రపై స్పందిస్తూ, వారి పాత్ర పురుషులతో సమానమైనదని, ఒకరికొకరు పరిపూరకమైనవారని తెలిపారు. ఇరు వర్గాల కార్యకలాపాల్లో జోక్యం ఉండకూడదనే ఉద్దేశంతోనే మహిళల కోసం ప్రత్యేక సమాంతర సంస్థ ఉందని, సంఘ్‌లో మహిళలకు స్థానం లేదనే వాదనను ఆయన తోసిపుచ్చారు.

## పీకేతో సునేత్ర పవార్ భేటీ

### బీజేపీ సీరియస్ వార్నింగ్

ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత్రి సునేత్ర పవార్ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో సమావేశం కావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ పరిణామంపై అధికార మహాయుతి కూటమిలోని బీజేపీ స్పందించింది. కూటమిలో అనుమానాలకు, విభేదాలకు తావిచ్చే చర్యలకు పాల్పడవద్దని మిత్రపక్షమైన ఎన్సీపీకి పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసింది. ముంబైలోని సునేత్ర పవార్ అధికారిక నివాసం 'దేవగిరి'లో గురువారం ఈ భేటీ జరిగింది. ఆమె కుమారుడు, ఎన్సీపీ నేత పార్థ్ పవార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. గంటల తరబడి సాగిన ఈ చర్చల్లో పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై మంతనాలు జరిపినట్లు ఎన్సీపీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది జనవరిలో తన భర్త, మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించిన తర్వాత సునేత్ర పవార్, ప్రశాంత్ కిశోర్‌తో భేటీ కావడం ఇది రెండోసారి. ఈ భేటీపై మహారాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ బవాన్‌కులే స్పందించారు. "కూటమిలో చీలికలు తెచ్చే ఎలాంటి చర్యలకు పూనుకోవద్దు" అని ఆయన హితవు పలికారు. ఇది ఎన్సీపీ అంతర్గత వ్యవహారమే అయినప్పటికీ, మహాయుతిలోని భాగస్వామ్య పక్షాలన్నీ కూటమి ధర్మానికి కట్టుబడి ఉండాలని, మిత్రపక్షాలను ఇబ్బంది పెట్టే పనులు చేయకూడదని ఆయన స్పష్టం చేశారు.

## జెన్ జీ దేశానికి బలం: కంగనా



న్యూఢిల్లీ: యువతను ఉద్దేశించి "గట్టర్ జనరేషన్" అని వ్యాఖ్యానించి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ తన వైఖరిని మార్చుకున్నారు. జెన్-జీ యువత దేశానికి బలమని, వారు గొప్ప ఆస్తి అని ఆమె కొనియాడారు. పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన కంగనా రనౌత్, "జెన్-జీ మన దేశానికి బలం, ఒక రకంగా చెప్పాలంటే గొప్ప ఆస్తి. మన యువత దేశ సంస్కృతికి, అస్తిత్వానికి ప్రతినిధులుగా నిలవడం ఎంతో సంతోషకరం" అని పేర్కొన్నారు. పది, పదిహేను మంది అనుచితంగా ప్రవర్తించినంత మాత్రాన యువతరం మొత్తాన్ని నిందించడం సరికాదని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను కంగనా రనౌత్ ప్రస్తావించారు. ఆయన సూచనలను తామంతా ఆలకించే అవకాశం లభించిందని తెలిపారు. నిరసన తెలిపే యువత డిమాండ్లను వినాలని, శాంతియుతంగా ఆందోళన చేసేవారు దేశ వ్యతిరేకులు కాదని, వారిపై ముద్రలు వేయకుండా చర్చలు జరపాలని మోహన్ భగవత్ సూచించిన విషయం తెలిసిందే. పరీక్షల్లో అక్రమాలపై నిరసన తెలుపుతున్న యువతను విమర్శిస్తూ కంగనా గతంలో తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని పోస్టులు చేశారు. కొందరు యువతులు ఉపయోగించిన భాషను తప్పుబడుతూ వారిని 'గట్టర్ జనరేషన్' అని సంబోధించారు. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో తాజాగా కంగనా రనౌత్ తన వ్యాఖ్యలను సవరించుకున్నారు. శాంతియుత నిరసనకారులకు, అల్లరి చేసే వారికి మధ్య వ్యత్యాసం ఉంటుందని ఆమె వివరణ ఇచ్చారు.

## డాబర్‌కు హైకోర్టులో ఊరట

### ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలకు బ్రేక్




న్యూఢిల్లీ: ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ డాబర్ ఇండియాకు ఢిల్లీ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. '100 శాతం' అంటూ ప్రచారం చేస్తున్న కొన్ని ఉత్పత్తుల విక్రయాలను నిలిపేయాలని ఆహార భద్రత నియంత్రణ సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ జారీ చేసిన ఆదేశాలపై కోర్టు శుక్రవారం స్టే విధించింది. తదుపరి విచారణ జరిగే ఆగస్టు 24 వరకు ఈ స్టే అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. డాబర్‌కు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వకుండా ఇలాంటి నిషేధాజ్ఞలు జారీ చేయడం సరైన విధానం కాదని జస్టిస్ అమిత్ మహాజన్ అభిప్రాయపడ్డారు. ఈ దశలో డాబర్ వాదనల్లో ప్రాథమికంగా బలం కనిపిస్తోందని పేర్కొంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం, ఎఫ్ఎస్ఎస్ఏఐకి నోటీసులు జారీ చేసి వివరణ కోరారు. తేనె, ఆవు నెయ్యి, వంట నూనెలు, యాపిల్ సైడర్ వెనిగర్, కొబ్బరినీళ్లు తదితర ఉత్పత్తులపై '100 శాతం నేచురల్', '100 శాతం ప్యూర్', '100 శాతం ప్యూరిటీ గ్యారంటీ', '100 శాతం ఆర్గానిక్', '100 శాతం టెండర్ కొబ్బరి నీళ్లు' వంటి ప్రచారాలు నిబంధనలకు విరుద్ధమని ఎఫ్ఎస్ఎస్ఏఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇవి వినియోగదారులను తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని పేర్కొంది.




## నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు నేడు నష్టాలతో ముగిశాయి. ఫైనాన్షియల్, ప్రైవేట్ బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా మార్కెట్ ప్రారంభం నుంచి ఒడిదొడుకులకు లోనైంది. దిగ్గజ ఫైనాన్షియల్ స్టాక్స్‌లో బలహీనత కారణంగా ప్రధాన సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 455.59 పాయింట్లు క్షీణించి 78,499.17 వద్ద స్థిరపడింది. ఇక, నిఫ్టీ 65.35 పాయింట్లు నష్టపోయి 24,570.65 వద్ద ముగిసింది. ఫైనాన్షియల్ స్టాక్స్‌లో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను తగ్గించుకోవడంతో మార్కెట్ సెంటిమెంట్ రోజంతా బలహీనంగానే ఉంది. ముఖ్యంగా నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు అత్యధికంగా నష్టపోయి మార్కెట్‌పై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. నిఫ్టీ షేర్లలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్ టాప్ లూజర్లుగా నిలిచాయి. అయితే, ప్రధాన సూచీలు నష్టపోయినప్పటికీ బ్రాడర్ మార్కెట్ కొంతమేర తట్టుకుని నిలబడింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.22 శాతం లాభపడగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.05 శాతం స్వల్పంగా నష్టపోయింది. రంగాల వారీగా చూస్తే.. ఆటో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) షేర్లు మార్కెట్‌కు కొంత మద్దతునిచ్చాయి. నిఫ్టీ ఆటో, నిఫ్టీ ఐటీ సూచీలు ప్రధాన రంగాల్లో టాప్ గెయినర్లుగా నిలిచి, సూచీల నష్టాలను కొంతవరకు పరిమితం చేశాయి.





# హస్తినను ముంచేసిన వాన

- స్తంభించిన జనజీవనం
- ప్రధాన రహదారులపై భారీగా ట్రాఫిక్
- పలుచోట్ల కూలిన ఇళ్లు, విరిగిన చెట్లు
- ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ

న్యూఢిల్లీ: ఢిల్లీతో పాటు దాని పరిసర ప్రాంతాలను (ఎన్సీఆర్) శుక్రవారం కుండపోత వర్షం ముంచెత్తింది. ఈ భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై ట్రాఫిక్ భారీగా స్తంభించడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. దక్షిణ ఢిల్లీలోని మెహ్రౌలీ-బదర్‌పూర్ రోడ్డులో పరిస్థితి పూర్తి జలమయంగా మారింది. ఇక్కడి ఎయిర్ ఫోర్స్ స్టేషన్ సమీపంలో సుమారు నాలుగు అడుగుల మేర నీరు నిలిచిపోవడంతో వాహనాలు నీటిలో చిక్కుకుపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఓఖ్లా మోర్, ఖాన్‌పూర్, సంగమ్ విహార్ వంటి ప్రాంతాలు కూడా నీట మునిగాయి. నీటిలో చిక్కుకున్న వాహనాలను బయటకు తీసేందుకు ఎయిర్ ఫోర్స్ ట్రక్కులు సహాయక చర్యలు చేపట్టాయి. ఐటీఓ, పటేల్ రోడ్, రోహతక్ రోడ్, ఢిల్లీ-జైపూర్ హైవే వంటి మార్గాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ వర్షాల ధాటికి తొమ్మిది ఇళ్లు కూలిపోయాయని, 16 ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయని ఢిల్లీ ఫైర్ సర్వీస్ విభాగం వెల్లడించింది. ఒక ఇంటిపై చెట్టు కూలడంతో లోపల చిక్కుకున్న ముగ్గురు మహిళలను అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. శుక్రవారం ఉదయం నాటికి సఫ్దర్‌జంగ్‌లో 59.2 మి.మీ, లోధి రోడ్డులో 60.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఫరీదాబాద్‌లో రికార్డు స్థాయిలో 119.4 మి.మీ వర్షపాతం కురిసింది. ఎన్సీఆర్ పరిధిలోని నోయిడాలో నీటితో నిండిన అండర్‌పాస్‌లో ఒక అంబులెన్స్ అరగంటకు పైగా చిక్కుకుపోయింది. గురుగ్రామ్‌లోని సివిల్ హాస్పిటల్ బేస్‌మెంట్‌లోకి వర్షపు నీరు చేరడంతో వైద్య సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. మరోవైపు, భారత వాతావరణ శాఖ ఈ ప్రాంతానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం రోజంతా భారీ వర్షాలు కొనసాగుతాయని, శనివారం నుంచి వర్ష తీవ్రత తగ్గుముఖం పట్టవచ్చని వాతావరణ శాఖ తెలిపింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయవద్దని అధికారులు సూచించారు.



## హసీనా వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు: భారత్

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఇటీవల నిర్వహించిన వర్చువల్ మీడియా సమావేశంతో తమకు ఎటువంటి సంబంధం లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఆ కార్యక్రమంలో, ముఖ్యంగా ఢాకాలోని ప్రస్తుత ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను తాము సమర్థించబోమని భారత్ తేల్చిచెప్పింది. న్యూఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ ఈ విషయాలను వెల్లడించారు. బుధవారం జరిగిన సదరు కార్యక్రమాన్ని ఒక ప్రైవేట్ మీడియా సంస్థ నిర్వహించిందని, ఇందులో భారత ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు. "బంగ్లాదేశ్‌లో చట్టబద్ధంగా ఏర్పాటైన ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను మేము ఏమాత్రం సమర్థించం" అని జైస్వాల్ పేర్కొన్నారు. బుధవారం న్యూఢిల్లీ నుంచి ఆడియో లింక్ ద్వారా నిర్వహించిన సమావేశంలో షేక్ హసీనా ప్రసంగించారు. బంగ్లాదేశ్‌లో గత రెండేళ్లుగా పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయని, ప్రజలు భయం, అభద్రత, ఆర్థిక ఇబ్బందుల మధ్య జీవిస్తున్నారని ఆమె ఆరోపించారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ రిగ్గింగ్ ద్వారా అధికారంలోకి వచ్చిందని విమర్శించిన ఆమె, ఈ ఏడాది చివరి నాటికి తాను తిరిగి బంగ్లాదేశ్‌కు వెళతానని తెలిపారు. షేక్ హసీనా వ్యాఖ్యలపై బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో భారత్ ఈ మేరకు స్పందించింది. పొరుగు దేశాల్లోని పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని, జాతీయ భద్రతా ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని రణధీర్ జైస్వాల్ పునరుద్ఘాటించారు.

## అమెరికాలో ఆగస్టు 15న 'ఇండియా డే'

బోస్టన్: అమెరికాలోని మసాచుసెట్స్ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీని అధికారికంగా 'ఇండియా డే'గా ప్రకటించింది. భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆ రాష్ట్ర ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో భారతీయ అమెరికన్ సమాజం అందిస్తున్న విశేష సేవలను గౌరవిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. భారత 79వ స్వాతంత్ర్య వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని, మసాచుసెట్స్ గవర్నర్ మౌరా హీలీ ఆగస్టు 1న ఈ అధికారిక ఉత్తర్వులపై సంతకం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ కింబర్లీ డ్రిస్కాల్, సెక్రటరీ ఆఫ్ కామన్వెల్త్ విలియం ఫ్రాన్సిస్ గాల్విన్ సైతం ఈ ప్రకటనను ఆమోదించారు. ఈ విశిష్ట సందర్భాన్ని మసాచుసెట్స్ రాష్ట్ర పౌరులందరూ గుర్తించి, వేడుకల్లో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 3.6 కోట్లకు పైగా ప్రవాస భారతీయులు ఉండగా, వారిలో దాదాపు 50 లక్షల మంది అమెరికాలోనే నివసిస్తున్నారని అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా మసాచుసెట్స్ రాష్ట్రంలో వైద్యం, సైన్స్, టెక్నాలజీ, విద్య, వ్యాపారం, ప్రజా సేవ వంటి రంగాల్లో భారతీయ అమెరికన్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రభుత్వం ప్రశంసించింది. వారి భాగస్వామ్యం ద్వారా రాష్ట్ర సాంస్కృతిక వైవిధ్యం, ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమయ్యాయని కొనియాడింది. ఇదే స్ఫూర్తితో, బోస్టన్ నగర మేయర్ మిచెల్ వు కూడా ఆగస్టు 15ను 'ఇండియా డే'గా ప్రకటిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.

# జంతర్ మంతర్‌ను ఎత్తేయండి

## ఢిల్లీలో ధర్నాలేమిటి?.. కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు ప్రశ్న



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా ఎందుకు కొనసాగిస్తున్నారు? దానిని ఎందుకు మూసివేయకూడదని ఢిల్లీ హైకోర్టు కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించింది. నిరసనల పేరుతో నగరాన్ని బందీగా మార్చడం సరికాదని శుక్రవారం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆల్ ఇండియా దళిత్ క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అమిత్ మహాజన్ విచారణ చేపట్టారు. సుమారు 75 మందితో శాంతియుతంగా నిరసన తెలిపేందుకు తాము జూలైలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, పోలీసులు ఇప్పటివరకు దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది సంజోయ్ ఘోష్ కోర్టుకు విన్నవించారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి, "అసలు జంతర్ మంతర్‌ను ఎందుకు మూసివేయకూడదు? నా అభిప్రాయం ప్రకారం ఇటువంటి నిరసనలు నగర నడిబొడ్డున జరగకూడదు. అనవసరంగా నగరాన్ని ఎందుకు బందీగా మార్చాలి?" అని వ్యాఖ్యానించారు. నిరసన ప్రదర్శనలు నగరం వెలుపల జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ వాదనలు వినిపిస్తూ, జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా కొనసాగించవచ్చా లేదా అనే అంశాన్ని సుప్రీంకోర్టు ఇప్పటికే పరిశీలిస్తోందని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల నేపథ్యంలో ఆ ప్రాంతంలో సెక్షన్ 144 అమల్లో ఉందని, భారీగా భద్రతా బలగాలను మోహరించామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఉభయ పక్షాల వాదనలు విన్న హైకోర్టు, పిటిషనర్ దరఖాస్తుపై ఆగస్టు 8లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీ పోలీసులను ఆదేశిస్తూ పిటిషన్‌ను పరిష్కరించింది. జంతర్ మంతర్‌కు బదులుగా రామ్‌లీలా మైదానం వంటి ప్రత్యామ్నాయ వేదికలను పరిశీలించాలని కోరుతూ దాఖలైన మరో పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇప్పటికే కేంద్రం స్పందన కోరింది.

## ఒక దేశంపై దాడి జరిగితే 3 దేశాలపై జరిగినట్టే

### పాక్, సౌదీ, టర్కీ మధ్య చారిత్రక ఒప్పందం

ఇస్తాంబుల్: పశ్చిమాసియా భౌగోళిక రాజకీయాల్లో ఒక చారిత్రక పరిణామం చోటుచేసుకుంది. , పాకిస్థాన్, సౌదీ అరేబియా, టర్కీ దేశాలు శుక్రవారం పవిత్ర మక్కా నగరంలో 'మక్కా ఉమ్మడి రక్షణ ఒప్పందం'పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం, ఈ మూడు దేశాల్లో ఏ ఒక్కదానిపై సాయుధ దాడి జరిగినా, దానిని మూడు దేశాలపై జరిగిన దాడిగా పరిగణిస్తారు. సామూహిక రక్షణను బలోపేతం చేయడం, సైనిక సహకారాన్ని మరింత లోతుగా విస్తరించడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. ఈ ఒప్పందంలో భాగంగా ఉమ్మడి సైనిక విన్యాసాలు, శిక్షణ కార్యక్రమాలు, రక్షణ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, గూఢచార సమాచార మార్పిడి వంటి అంశాలు ఉన్నాయి. అయితే ఇది పూర్తిగా రక్షణాత్మక ఒప్పందమని, ఏ ఒక్క దేశానికీ వ్యతిరేకం కాదని టర్కీ అధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ కూటమిలో చేరాలనుకునే ఇతర ప్రాంతీయ భాగస్వాములకు తలుపులు తెరిచే ఉంటాయని, ఈ ఒప్పందం వల్ల టర్కీ నాటో సభ్యత్వం వంటి ఇప్పటికే ఉన్న ద్వైపాక్షిక, బహుపాక్షిక ఒప్పందాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన వివరించారు. మక్కాలో జరిగిన ఈ ఒప్పందంపై సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సంతకాలు చేశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఉమ్రా చేసేందుకు సౌదీ వచ్చిన షరీఫ్, ఈ ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ కూడా హాజరు కావడం గమనార్హం. దాదాపు ఏడాది కాలంగా జరుగుతున్న చర్చల ఫలితంగా ఈ ఒప్పందం రూపుదిద్దుకుంది. 2025 సెప్టెంబర్‌లో పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య జరిగిన వ్యూహాత్మక ఒప్పందానికి ఇది కొనసాగింపుగా భావిస్తున్నారు.

## ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లు మా అంతర్గతం

### అమెరికాకు భారత్ గట్టి కౌంటర్

న్యూఢిల్లీ: విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లు-2026పై అమెరికా కాంగ్రెస్ సభ్యుడు చేసిన విమర్శలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇది పూర్తిగా తమ అంతర్గత వ్యవహారమని, దీనిపై ఇతరుల వ్యాఖ్యలు అనవసరమని స్పష్టం చేసింది. విదేశీ నిధుల నియంత్రణకు సంబంధించి అమెరికాతో సహా ప్రపంచంలోని అనేక దేశాల్లో కఠినమైన చట్టాలు అమలులో ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తుచేసింది. అమెరికాకు చెందిన రిపబ్లికన్ పార్టీ ప్రతినిధి రైలీ మూర్ ఆగస్టు 4న మాట్లాడుతూ, ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లు క్రైస్తవులపై జరుగుతున్న స్పష్టమైన దాడి అని ఆరోపించారు. ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ రద్దయినా లేదా పునరుద్ధరణ జరగకపోయినా.. చర్చిలు, మతపరమైన స్వచ్ఛంద సంస్థలను ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకునే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విమర్శలపై గురువారం విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. భారత్‌లో చట్టాల రూపకల్పనకు పటిష్ఠమైన ప్రజాస్వామ్య ప్రక్రియ ఉందని, దేశీయ చట్టాలను సరైన కోణంలో అర్థం చేసుకోవాలని సూచించారు.

## వయ్యారి చిత్రం





## విజయ్ విడాకుల పిటిషన్ వెనక్కి

### కీలక నిర్ణయం తీసుకున్న భార్య సంగీత

తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ వ్యక్తిగత జీవితంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయన భార్య సంగీత తాను దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు. దీంతో గత కొన్ని నెలలుగా చర్చనీయాంశంగా మారిన ఈ వ్యవహారానికి తాత్కాలికంగా తెరపడింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో చెంగల్పట్టు కోర్టును ఆశ్రయించిన సంగీత, తమ దాంపత్య బంధాన్ని రద్దు చేయాలని కోరారు. ఇద్దరి మధ్య విభేదాలు సర్దుబాటు అయ్యే పరిస్థితి లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. భరణం ఇవ్వాలని, చెన్నైలోని నీలంకరై నివాసంలో ఉండేందుకు అనుమతి కల్పించాలని కూడా విజ్ఞప్తి చేశారు. విడాకుల కేసు విచారణ ఈ ఏడాది పలుసార్లు వాయిదా పడింది. గత నెల జరిగిన విచారణకు విజయ్, సంగీత ఇద్దరూ హాజరుకాలేదు. వారి తరఫు న్యాయవాదులు మాత్రమే కోర్టుకు హాజరై వ్యక్తిగత కారణాలతో రాలేకపోయినట్లు తెలిపారు. అనంతరం విచారణను ఆగస్టు 7కు వాయిదా వేశారు. తాజా విచారణ సందర్భంగా సంగీత తన విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఆమె నిర్ణయానికి గల కారణాలపై మాత్రం ఎలాంటి అధికారిక సమాచారం వెల్లడికాలేదు. సంగీత వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న కోర్టు, పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి ఇచ్చింది. ఈ కేసును "విత్‌డ్రాన్"గా పరిగణిస్తూ మూసివేస్తున్నట్లు (డిస్పోజ్) ప్రకటించింది. సంగీత నిర్ణయంపై విజయ్ తరఫు న్యాయవాది ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. భవిష్యత్తులో అవసరమైతే మళ్లీ కొత్త పిటిషన్ దాఖలు చేసుకునేందుకు సంగీతకు కోర్టు స్వేచ్ఛనిచ్చింది.

## కొరియన్ కనకరాజు..

### అసలు హీరో కమెడియన్ సత్య

దెయ్యం కథలు మనకు కొత్త కాదు.. కానీ కొరియన్ దెయ్యం మాత్రం కచ్చితంగా కొత్తదే. కొరియన్ కనకరాజులో దర్శకుడు మేర్లపాక గాంధీ తీసుకున్న కొత్త పాయింట్ ఇది ఒకటే. మిగిలిన సినిమా అంతా మనం ఎన్నో వందల సినిమాలలో చూసిన కథ. అనగనగా పెనుగొండ.. అక్కడ చెక్కభజన చేసుకునే కనకరాజు.. ఎక్కడో కొరియాలో ఒక యాక్సిడెంట్.. అక్కడినుంచి వేల కిలోమీటర్లు ట్రావెల్ చేసి అనుకోకుండా ఇక్కడికి వచ్చిన ఒక ఆత్మ. ఆ ఆత్మ కనకరాజులో చేరిన తర్వాత మనోడు కొరియన్ కనకరాజులా మారి ఏం చేశాడు అనేది కథ. ఫస్టాఫ్ మొత్తం సరదా సరదాగా




సాగిపోతుంది. సత్య వన్ లైనర్స్ అన్ని బాగా పేలాయి.. ఒక రకంగా మనోడే సినిమాను ముందుకు తీసుకెళ్లాడు ఇంటర్వెల్ కూడా ఎక్స్పెక్టెడ్ ట్విస్ట్ తోనే ముగుస్తుంది. సెకండ్ హాఫ్ మొత్తం కొరియాలోనే కథ ఉంటుంది. ఒకటి రెండు సీన్స్ బాగానే పేలాయి.. ముఖ్యంగా వీడియో కాల్ పూజ సీన్. క్లైమాక్స్ మాత్రం డిసప్పాయింట్ చేశారు.. కనకరాజుగా వరుణ్ తేజ్ మంచి ఈజ్ చూపించాడు. రితిక నాయక్ కొరియన్ అమ్మాయిలాగే ఉంది. కమెడియన్ సత్య మరోసారి సినిమాను తన భుజాల మీద వేసుకున్నాడు. తమన్ మ్యూజిక్ రొటీన్ గానే ఉంది. మేర్లపాక గాంధీ ఎక్కడ రిస్కు తీసుకోకుండా టెంప్లేట్ కథ చెప్పాడు.

**ఓవరాల్ గా కొరియన్ కనకరాజు.. దెయ్యం కొత్తదే.. మిగిలింది రొటీన్..!**

**సమీక్షకుడు: ప్రవీణ్ కుమార్, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టు**



## సెప్టెంబర్ 11న

### ఆనంద్, వైష్ణవి 'ఎపిక్' రిలీజ్

టాలీవుడ్ యువ హీరో ఆనంద్ దేవరకొండ, కథానాయిక వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్'. 'బేబీ' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత ఈ విజయవంతమైన కాంబినేషన్ మళ్లీ కలిసి నటిస్తుండటంతో సినిమాపై మొదటినుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సాయి సౌజన్య, నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తూ ఒక కొత్త పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11న థియేటర్ల లో విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. అందమైన ప్రయాణాలు సాధారణ క్షణాలతోనే ప్రారంభమవుతాయి అనే క్యాప్షన్‌తో విడుదల చేసిన పోస్టర్‌లో ఆనంద్ వైష్ణవి చైతన్య కలర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు.

## ఎన్టీఆర్ డైలాగ్‌ను ట్రోల్ చేయలేదు: వరుణ్ తేజ్

మెగా హీరో వరుణ్ తేజ్ నటించిన కొరియన్ కనకరాజు శుక్రవారం థియేటర్లలోకి వచ్చేసింది. అయితే ఈ మూవీలోని ఓ డైలాగ్ వివాదానికి దారితీసింది. ఎన్టీఆర్ డైలాగ్ చుట్టు వివాదం మొదలైంది. దీనిపై హీరో వరుణ్ తేజ్ స్పందించారు. మూవీ ప్రెస్‌మీట్‌కు హాజరైన ఆయన డైలాగ్‌పై క్లారిటీ ఇచ్చారు. అయితే ఇందులో తాము సీనియర్ ఎన్టీఆర్‌ను అగౌరపరచలేదని వరుణ్ తేజ్ స్పష్టం చేశారు. ఆయనపై మేము ట్రోల్ చేయలేదని.. కేవలం ఇమిటేట్ మాత్రమే చేశామని క్లారిటీ ఇచ్చారు. ట్రోలింగ్‌కు.. ఇమిటేషన్‌కు చాలా తేడా ఉందన్నారు.





## నెట్‌ఫ్లిక్స్‌లో నాన్ ఇంగ్లిష్ వరల్డ్ నెం.1.. ధురంధర్

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' అంతర్జాతీయ స్థాయిలో అరుదైన ఘనతను దక్కించుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వీక్షణలు పొందిన నాన్-ఇంగ్లీష్ చిత్రంగా ఈ సినిమా రికార్డు సృష్టించింది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ కో-సీఈవో టెడ్ సరాండోస్ వెల్లడించారు. 'ఎక్స్‌ప్రెస్ అడ్డా' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, , ఈ ఏడాది అమెరికా, యూకే చిత్రాల తర్వాత అంతర్జాతీయంగా అత్యధిక వ్యూస్ సాధించిన చిత్రంగా 'ధురంధర్' నిలిచిందని పేర్కొన్నారు. గణాంకాల ప్రకారం, 2026 జనవరి నుంచి జూన్ మధ్య కాలంలో ఈ సినిమా ఏకంగా 37 మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఏకకాలంలో 22 దేశాల్లో నెట్‌ఫ్లిక్స్ చార్టులలో ఈ చిత్రం అగ్రస్థానంలో నిలవడం విశేషం. ఆదిత్య ధర్ దర్శకత్వంలో రెండు భాగాలుగా రూపొందిన ఈ ఫ్రాంచైజీ, ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద రూ. 3,100 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టి సత్తా చాటింది.

## నన్ను కమిట్‌మెంట్ అడిగారు

**చాందిని చౌదరి**

సినీ ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ అనే పదం కామన్. ముఖ్యంగా నటీమణులు ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో ఇలాంటి అనుభవాన్ని ఎదుర్కొని ఉంటారు. ఇప్పటికే పలువురు సినీతారలు తమకెదురైన చేదు అనుభవాలను పలు సందర్భాల్లో బయటికి చెప్పుకొచ్చారు. తాజాగా మరో టాలీవుడ్ నటి సినీ ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్‌పై సంచలన కామెంట్స్ చేసింది. టాలీవుడ్ నటి చాందిని చౌదరి తనకెదురైన క్యాస్టింగ్ కౌచ్ అనుభవాన్ని పంచుకుంది. 2015లో ఓ బ్రాండ్ అంబాసిడర్ ఛాన్స్ పేరుతో తనను పిలిచారని తెలిపింది. ఆ సమయంలో ఓ వ్యక్తి ఫోన్ చేసి కమిట్‌మెంట్ ఇవ్వాలని అడిగారని గుర్తు చేసుకుంది. తాను తిరస్కరించడంతో మా అమ్మకు ఫోన్ చేసి కూడా అవమానించాడని చాందిని చౌదరి వెల్లడించింది. అంతేకాకుండా తనపై నెగెటివ్ ప్రచారం చేశారని చెప్పుకొచ్చింది. చాందినికి పొగరు ఎక్కువనే ముద్ర వేశారని, అది ఇప్పటికీ తనని ఇబ్బంది పెడుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పుడిదే టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.



## నా జీవితాన్ని మార్చుకోను



ఒకప్పుడు తెలుగు, హిందీ చిత్రాల్లో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న అమీషా పటేల్ మరోసారి తన వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 51 ఏళ్ల వయసులోనూ అవివాహితగా కొనసాగుతున్న ఆమె, పెళ్లి గురించి తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారు. తాను ఎప్పటికీ పెళ్లి చేసుకోనని, ప్రస్తుతం సింగిల్ జీవితంతో ఎంతో సంతోషంగా ఉన్నానని చెప్పారు. తాజాగా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా అభిమానులతో నిర్వహించిన 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో ఓ అభిమాని.. మీరు ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు? అని ప్రశ్నించాడు. దీనికి ఏమాత్రం సందేహించకుండా అమీషా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. 'నేను ఎప్పటికీ పెళ్లి చేసుకోను. సింగిల్‌గా చాలా సంతోషంగా ఉన్నాను. నన్ను ప్రేమించే కుటుంబ సభ్యులు, స్నేహితులు నాకు చాలామంది ఉన్నారు. ఒక్క వ్యక్తి కోసం నా జీవితాన్ని, నా ఆనందాన్ని పూర్తిగా మార్చుకోవాలని నేను అనుకోవడం లేదు' అని తేల్చేసింది.




# మాస్టర్ బ్లాస్టర్..
# బ్రాండ్‌లోనూ బ్లాస్ట్1

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఆటకు వీడ్కోలు పలికి ఏళ్లు గడుస్తున్నా, అతని క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. బ్రాండ్ విలువలో ఇప్పటికీ దేశంలోని టాప్ సెలబ్రిటీలతో పోటీ పడుతున్నాడు. తాజాగా విడుదలైన 'క్రోల్ ఇండియా సెలబ్రిటీ బ్రాండ్ వాల్యుయేషన్ 2025' నివేదిక ప్రకారం సచిన్ బ్రాండ్ విలువ 125.9 మిలియన్ డాలర్లకు (సుమారు రూ. 1,201 కోట్లు) చేరింది. దీంతో అతడు దేశంలోనే టాప్-5లో స్థానం సంపాదించాడు. విశేషమేమిటంటే.. ఈ జాబితాలో టాప్-10లో నిలిచిన ఏకైక రిటైర్డ్ క్రీడాకారుడు సచిన్ కావడం. ఏటా అతని బ్రాండ్ విలువ పెరుగుతూనే ఉండటం గమనార్హం. సచిన్‌పై ప్రజల్లో ఉన్న అపారమైన నమ్మకం, విశ్వసనీయత, తరగని కీర్తిప్రతిష్టలే ఈ స్థాయి బ్రాండ్ విలువకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అందుకే వివిధ రంగాలకు చెందిన ప్రముఖ బ్రాండ్‌లు ఇప్పటికీ ఆయనతో ఒప్పందాలు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. 'గాడ్ ఆఫ్ క్రికెట్'గా, 'మాస్టర్ బ్లాస్టర్'గా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న సచిన్‌కు ఈ స్థాయి బ్రాండ్ ఇమేజ్ రావడానికి మైదానంలో ఆయన సృష్టించిన అసాధారణ రికార్డులే పునాది.

# రహానే
# కొత్త ఇన్నింగ్స్




భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజింక్యా రహానే తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వెంటనే, యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ (ఈటీపీఎల్)లో అడుగుపెట్టాడు. ఈ లీగ్ తొలి ఎడిషన్ కోసం అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ ఫ్రాంచైజీకి కీలక ఆటగాడిగా రహానే సంతకం చేశాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ యాజమాన్యం నేడు అధికారికంగా వెల్లడించింది. ఐసీసీ ఆమోదం పొందిన యూరప్‌లోని మొట్టమొదటి టీ20 లీగ్ ఇదే కావడం విశేషం. ఈ లీగ్ తొలి సీజన్ ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 20 వరకు జరగనుంది. ఇందులో గ్లాస్గో, అమ్‌స్టర్‌డామ్, ఎడిన్‌బర్గ్, డబ్లిన్, బెల్ఫాస్ట్, రోటర్‌డామ్ నగరాలకు చెందిన ఆరు ఫ్రాంచైజీలు పోటీ పడనున్నాయి. భారత్ తరఫున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌లు ఆడిన రహానేకు అపారమైన అనుభవం ఉంది. ఐపీఎల్‌లో 212 మ్యాచ్‌లు ఆడి, ఇటీవలి సీజన్లలో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు నాయకత్వం వహించాడు. రహానే చేరికపై అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ వా హర్షం వ్యక్తం చేశాడు. రహానే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, వినయం జట్టుకు ఎంతో మేలు చేస్తాయని అన్నాడు.

# 55 ఏళ్లు.. 5,000 మ్యాచ్‌లు

## వన్డే క్రికెట్ అరుదైన మైలురాయి

ఐసీసీ వన్డే వరల్డ్ కప్ లీగ్-2లో పోర్ట్‌హిల్ వేదికగా స్కాట్లాండ్- కెనడా మధ్య జరిగిన మ్యాచ్ ఓ చారిత్రత్మక రికార్డుకు వేదికైంది. ఈ పోరుతో అంతర్జాతీయ వన్డే క్రికెట్ 5,000 మ్యాచ్‌ల మైలురాయిని చేరుకుంది. 1971లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా తొలి వన్డే మ్యాచ్ జరిగింది. వన్డే క్రికెట్ ప్రారంభంలో ఇన్నింగ్స్‌కు 60 ఓవర్లు ఉండేవి. 1975, 1979, 1983 ప్రపంచకప్‌లు 60 ఓవర్ల ఫార్మాట్‌లోనే జరిగాయి. ఆ తర్వాత 1987 ప్రపంచకప్ నుంచి 50 ఓవర్ల ఫార్మాట్‌గా మారింది. తొలి 1,000 మ్యాచ్‌లు పూర్తికావడానికి 24 ఏళ్లు (1995) పట్టగా.. తదుపరి 31 ఏళ్లలోనే వన్డేల సంఖ్య 5,000కు చేరుకోవడం విశేషం. అయితే అత్యధిక వన్డు మ్యాచ్‌లు ఆడిన జట్టుగా టీమిండియా కొనసాగుతోంది. భారత్ ఇప్పటివరకు 1050కు పైగా వన్డేలు ఆడింది. ఆ తర్వాతి స్థానాల్లో ఆస్ట్రేలియా(1000కు పైగా), పాకిస్తాన్(970ం) ఉన్నాయి. కాగా ఈ ఫార్మాట్‌లో అత్యంత విజయవంతమైన జట్టుగా మాత్రం ఆసీస్ టాప్ ప్లేస్‌లో ఉంది. 6 వన్డే ప్రపంచకప్‌లు, 600కు పైగా విజయాలు ఇప్పటివరకు కంగారులు సాధించారు.

**5000 వన్డేల ప్రయాణం ఇలా..**

**మొదటి వన్డే:** ఆస్ట్రేలియా వర్సెస్ ఇంగ్లండ్ (మెల్‌బోర్న్, 1971)
**1000వ వన్డే:** వెస్టిండీస్ వర్సెస్ ఇంగ్లండ్ (నాటింగ్‌హామ్, 1995)
**2000వ వన్డే:** పాకిస్థాన్ వర్సెస్ జింబాబ్వే (షార్జా, 2003)
**3000వ వన్డే:** ఆస్ట్రేలియా వర్సెస్ ఇంగ్లండ్ (సౌతాంప్టన్, 2010)
**4000వ వన్డే:** హాంకాంగ్ వర్సెస్ పాపువా న్యూ గినియా (హరారే, 2018)
**5000వ వన్డే:** కెనడా వర్సెస్ స్కాట్లాండ్ (డూండీ, 2026)




**తొలిరోజు లంక ఎలెవన్ భారీ స్కోరు**
**ఫర్వాలేదనిపించిన భారత స్పిన్నర్లు**

# తేలిపోయిన భారత బౌలర్లు




**శ్రీలంకతో జరగనున్న టెస్టు సిరీస్‌కు ముందు భారత జట్టు ఆడుతున్న మూడు రోజుల వార్మప్ మ్యాచ్ తొలిరోజు ఆట ముగిసింది. భారత స్పిన్నర్లు రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్ రాణించినప్పటికీ, శ్రీలంక క్రికెట్ ఎలెవన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 363 పరుగుల భారీ స్కోరు సాధించింది.**

**శుక్రవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక జట్టుకు ఓపెనర్లు నిషాన్ మదుష్క(66), రవిందు రసంత (71) అద్భుతమైన ఆరంభాన్ని అందించారు.**

తొలి వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పి భారత పేసర్లు మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలపై ఆధిపత్యం చెలాయించారు. అయితే, మదుష్క రనౌట్‌గా వెనుదిరగడంతో ఈ భాగస్వామ్యానికి తెరపడింది. భోజన విరామం తర్వాత భారత స్పిన్నర్లు పుంజుకున్నారు. ఐపీఎల్ 2026 తర్వాత తొలిసారి బరిలోకి దిగిన రవీంద్ర జడేజా (2/64) కీలక వికెట్లు పడగొట్టాడు. యువ స్పిన్నర్ మానవ్ సుతార్ (2/48), కుల్దీప్ యాదవ్ (2/76) కూడా తమ స్పిన్‌తో లంక బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. ఫ్లాట్‌గా ఉన్న పిచ్‌పై స్పిన్నర్లు టర్న్ రాబట్టడంతో శ్రీలంక మిడిల్ ఆర్డర్ తడబడింది. లంక జట్టులో కెప్టెన్ సోనాల్ దినూష (52) కూడా హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ ఒక వికెట్ తీశాడు. ఈ మ్యాచ్‌కు కేఎల్ రాహుల్ నాయకత్వం వహిస్తున్నాడు. ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుంది.

### తొలిరోజు వార్మప్ మ్యాచ్‌కు గిల్ దూరం

భారత టెస్టు జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు గాయమైంది. గురువారం జరిగిన ప్రాక్టీస్




సెషన్‌లో అతడి కుడి చేతి ఉంగరపు వేలికి బలమైన దెబ్బ తగిలింది. దీంతో శ్రీలంక క్రికెట్ బోర్డు ఎలెవన్‌తో జరుగుతున్న వార్మప్ మ్యాచ్ తొలి రోజు అతడు మైదానంలోకి దిగడం లేదని బీసీసీఐ ప్రకటించింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. గిల్ ఆరోగ్య పరిస్థితిని బీసీసీఐ వైద్య బృందం ఎప్పటికప్పుడు పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఆయన పురోగతిపై నిఘా ఉంచినట్లు వెల్లడించింది.

# 45.81 సెకన్లలోనే 400 మీటర్ల రేసు

**అష్ఫాక్ సంచలనం.. జాతీయ రికార్డు బద్దలు**

ప్రపంచ అథ్లెటిక్స్ అండర్-20 (యూ20) ఛాంపియన్‌షిప్స్‌లో భారత యువ స్ప్రింటర్ మహమ్మద్ అష్ఫాక్ సంచలనం సృష్టించాడు. పురుషుల 400 మీటర్ల రేసులో జాతీయ రికార్డును బద్దలు కొడుతూ సెమీఫైనల్‌లోకి దూసుకెళ్లాడు. మరోవైపు, హైజంప్‌లో బసంత్ ఫైనల్‌కు అర్హత సాధించి భారత శిబిరంలో ఆనందం నింపాడు. అమెరికాలోని యూజీన్ వేదికగా జరుగుతున్న ఈ మెగా టోర్నీలో, పురుషుల 400 మీటర్ల హీట్స్‌లో అష్ఫాక్ అద్భుత ప్రదర్శన చేశాడు. రేసును కేవలం 45.81 సెకన్లలో పూర్తి చేసి, తన పేరిట ఉన్న 46.05 సెకన్ల జాతీయ అండర్ 20 రికార్డును తానే తిరగరాశాడు. హీట్స్‌లో రెండో స్థానంలో నిలిచినప్పటికీ, అత్యుత్తమ టైమింగ్‌తో సెమీస్‌కు అర్హత సాధించాడు. ఓవరాల్‌గా క్వాలిఫయర్స్ అందరిలోనూ నాలుగో అత్యుత్తమ సమయం నమోదు చేయడం విశేషం.




# ఫ్యాన్స్‌కు ఎంట్రీ ఫ్రీ

**భారత్‌తో టెస్ట్ సిరీస్.. శ్రీలంక బోర్డు బంపరాఫర్**

క్రికెట్ అభిమానులకు శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) బోర్డు తీపి కబురు అందించింది. భారత్‌తో స్వదేశంలో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను వీక్షించేందుకు స్టేడియంలోకి అభిమానులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సిరీస్ ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025--27లో భాగంగా జరగనుంది. తొలి టెస్టు ఆగస్టు 15 నుంచి 19 వరకు గాలె అంతర్జాతీయ స్టేడియంలో, రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరగనున్నాయి.




# సెయింట్ లూయిస్..
# ప్రజ్ఞానంద!

**అదరగొట్టిన భారత యువ గ్రాండ్ మాస్టర్**
**టోర్నమెంట్ విజేతగా నిలిచిన వైనం**
**ఒక రౌండ్ ముందే గెలుపు రికార్డు**

భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద మరోసారి తన సత్తా చాటాడు. అమెరికాలో జరిగిన గ్రాండ్ చెస్ టూర్ సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచాడు. ఒక రౌండ్ మిగిలి ఉండగానే టైటిల్‌ను ఖాయం చేసుకున్నాడు. చివరి ప్రత్యక్ష పోరులో జవోఖిర్ సిందరోవ్‌తో ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. ఈ ఫలితంతో టైటిల్ అతని సొంతమైంది. మొత్తం 35 పాయింట్లకు గాను 23 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. సిందరోవ్ 22 పాయింట్లతో రెండో స్థానం దక్కించుకున్నాడు. వెస్లీ సో 20.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. లెవాన్ అరోనియన్ 19 పాయింట్లతో నాలుగో స్థానం సాధించాడు. ఈ విజయంతో ప్రజ్ఞానందకు 50 వేల అమెరికన్ డాలర్ల నగదు బహుమతి లభించింది. అలాగే గ్రాండ్ చెస్ టూర్‌లో 13 పాయింట్లు కూడా ఖాతాలో చేరాయి. ప్లేఆఫ్ అవసరం లేకుండానే నేరుగా టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ ఫలితంతో గ్రాండ్ చెస్ టూర్ మొత్తం ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకున్నాడు. ఫాబియానో కరువానా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. జులై 31 నుంచి ఆగస్టు 7 వరకు జరిగిన ఈ టోర్నీలో ప్రపంచంలోని 10 మంది అగ్రశ్రేణి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడ్డారు. ఐదు రోజుల పాటు జరిగిన పోటీల్లో ప్రజ్ఞానంద ఆరంభం నుంచే ఆధిక్యాన్ని కొనసాగించాడు. చివరి వరకు సిందరోవ్ గట్టి పోటీ ఇచ్చినా టైటిల్‌కు ఒక్క అడుగు దూరంలో ఆగిపోయాడు. ఈ ఏడాది జూన్‌లో నార్వే చెస్ టోర్నమెంట్‌లోనూ ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. ఆ ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను గెలిచిన తొలి భారత ఆటగాడిగా నిలిచాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు 12
శనివారం 8-8-2026, జగిత్యాల



# యూపీఐపై చార్జీల మోత.. వినియోగదారుడికే వాత

డిజిటల్ చెల్లింపుల విప్లవానికి భారతదేశంలో యూపీఐ వెన్నెముకగా మారింది. చిల్లర దుకాణం నుంచి పెద్ద వ్యాపార సంస్థ వరకు.. కూరగాయల బండి నుంచి ఆన్‌లైన్ కొనుగోళ్ల వరకు.. ఎక్కడ చూసినా యూపీఐ చెల్లింపులే కనిపిస్తున్నాయి. చేతిలో నగదు లేకపోయినా చెల్లింపు పూర్తవుతోంది. బ్యాంకు ఖాతా నుంచి క్షణాల్లో డబ్బు బదిలీ అవుతోంది. సాంకేతికత సామాన్యుడి జీవితాన్ని ఇంతగా సులభతరం చేసిన ఉదాహరణలు చాలా అరుదు. అలాంటి వ్యవస్థపై చార్జీల మోత మొదలైతే మాత్రం దాని ప్రభావం నేరుగా సామాన్యుడి జేబుపైనే పడే ప్రమాదం ఉంది. యూపీఐ చెల్లింపులపై చార్జీలు విధించే అంశం ఎప్పటికప్పుడు చర్చకు వస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఒక్కో లావాదేవీకి ఎంత వసూలు చేస్తారు? ఎవరి నుంచి వసూలు చేస్తారు? వ్యాపారి చెల్లిస్తాడా? వినియోగదారుడి నుంచి వసూలు చేస్తారా? లేక బ్యాంకులు, చెల్లింపు సంస్థల మధ్యే భారాన్ని పంచుకుంటారా? అన్నది పక్కన పెడితే.. చివరికి ఆ వ్యయం ఎక్కడికి చేరుతుంది? అన్న ప్రశ్నకు సమాధానం మాత్రం స్పష్టమే---వ్యాపార వ్యయంగా మారిన ప్రతి అదనపు రూపాయి చివరికి వినియోగదారుడి మీద పడే అవకాశమే ఎక్కువ. ఒక్క లావాదేవీకి కొన్ని పైసలు లేదా రూపాయి చార్జీ విధిస్తే ఏమవుతుందని అనిపించవచ్చు. కానీ రోజుకు కోట్లాది లావాదేవీలు జరిగే వ్యవస్థలో చిన్న చార్జీ కూడా భారీ మొత్తంగా మారుతుంది. ఒక వ్యాపారి రోజుకు వందల లావాదేవీలు చేస్తుంటే, ప్రతి చెల్లింపుపై వ్యయం పెరుగుతుంది. పెద్ద వ్యాపార సంస్థలకు అది నిర్వహణ ఖర్చులో ఒక భాగంగా కనిపించవచ్చు. కానీ చిన్న దుకాణదారుడికి ప్రతి రూపాయి ఖర్చే భారమే. అక్కడితో సమస్య ముగియదు. వ్యాపారి తన వ్యయాన్ని ధరల్లో కలిపే ప్రయత్నం చేస్తే చివరికి వస్తువుల ధర పెరుగుతుంది. అంటే యూపీఐ చెల్లింపుపై నేరుగా చార్జీ విధించకపోం ఓయినా.. పరోక్షంగా వినియోగదారుడే చెల్లించే పరిస్థితి రావచ్చు. అందుకే యూపీఐ చార్జీలపై చర్చను కేవలం బ్యాంకులు, చెల్లింపు సంస్థలు, వ్యాపారుల మధ్య ఆర్థిక లావాదేవీగా చూడకూడదు. ఇది కోట్లాది వినియోగదారుల జేబులకు సంబంధించిన అంశం.



# క్విట్ ఇండియా.. చేంజ్ ఇండియా!

ఆగస్టు 8 భారతదేశ చరిత్రలో ఒక మలుపు. 1942లో ఇదే రోజున ముంబై లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపుతో 'క్విట్ ఇండియా' ఉద్యమానికి నాంది పలికింది. ఆగస్టు 9 నుంచి దేశవ్యాప్తంగా ఉద్యమం ఉధృతమైంది. "చేయండి లేదా చావండి" అనే గాంధీజీ పిలుపు కోట్లాది భారతీయుల్లో స్వాతంత్ర్య కాంక్షను మరింత బలపరిచింది. బ్రిటిష్ పాలనను అంతం చేయాలన్న సంకల్పంతో విద్యార్థులు, కార్మికులు, రైతులు, మహిళలు, సామాన్య ప్రజలు వీధుల్లోకి వచ్చారు. జైళ్లకు వెళ్లారు. లాఠీ దెబ్బలు తిన్నారు. ప్రాణాలను సైతం త్యాగం చేశారు. అది కేవలం ఒక రాజకీయ ఉద్యమం కాదు. బానిసత్వాన్ని అంగీకరించబోమనే ఒక జాతి సామూహిక ప్రకటన. అయితే 1942 ఆగస్టు క్రాంతిని 2026లో మనం ఎందుకు గుర్తు చేసుకోవాలి? బ్రిటిష్ పాలన లేదు. దేశం స్వతంత్రం. మన చేతుల్లో రాజ్యాంగం ఉంది. ఓటు హక్కు ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థ ఉంది. మరి నేటి తరానికి ఆ ఉద్యమం ఏం చెబుతోంది? సమాధానం చాలా స్పష్టం.. స్వాతంత్ర్యం ఒకసారి సాధించుకున్న హక్కు మాత్రమే కాదు; ప్రతి తరమూ కాపాడుకోవాల్సిన బాధ్యత. నాటి తరం దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం కోసం పోరాడింది. నేటి తరం దేశానికి సామాజిక, ఆర్థిక, విద్యా, సాంకేతిక, పర్యావరణ స్వావలంబన కోసం పోరాడాలి. అప్పట్లో విదేశీ పాలన నుంచి విముక్తి అవసరమైతే, ఇప్పుడు నిరుద్యోగం, పేదరికం, నిరక్షరాస్యత, అవినీతి, మాదకద్రవ్యాల వ్యసనం, సామాజిక వివక్ష, డిజిటల్ అపసమాచారం, పర్యావరణ విధ్వంసం వంటి సమస్యల నుంచి సమాజాన్ని విముక్తి చేయాల్సిన అవసరం ఉంది. 1942లో "భారత్ విడిచి వెళ్లండి" అన్న నినాదం వినిపించింది. నేడు అదే స్ఫూర్తిని "భారత్‌ను నిర్మిద్దాం" అనే సంకల్పంగా మార్చుకోవాల్సిన సమయం. నేటి యువత చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంది. ప్రపంచ జ్ఞానం క్షణాల్లో అందుబాటులో ఉంది. కృత్రిమ మేధ, అంతరిక్ష పరిశోధన, జీవ సాంకేతికత, సెమీకండక్టర్లు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వంటి రంగాల్లో భారత్ కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. ప్రపంచంలోనే అత్యంత యువ జనాభా కలిగిన దేశంగా భారత్‌కు అపారమైన శక్తి ఉంది. కానీ ఇదే సమయంలో నిరుద్యోగం, నైపుణ్యాల కొరత, పరీక్షల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న యువత, పెరుగుతున్న మానసిక ఒత్తిడి వంటి సమస్యలు కూడా ఉన్నాయి. యువత జనాభా లాభం దేశానికి బలంగా మారాలంటే విద్యతో పాటు నైపుణ్యం, ఉపాధి, ఆవిష్కరణలకు అవకాశాలు కల్పించాలి. నాటి స్వాతంత్ర్య సమరయోధులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి దేశం కోసం ఆలోచించారు. నేటి తరానికి దేశభక్తి అంటే కేవలం జాతీయ పతాకాన్ని ఎగురవేయడం, జాతీయ గీతం పాడడం మాత్రమే కాదు. పన్నులు సక్రమంగా చెల్లించడం, ఓటు హక్కును బాధ్యతగా వినియోగించడం, ప్రజా ఆస్తిని కాపాడటం, పర్యావరణాన్ని రక్షించడం, అవినీతిని ప్రోత్సహించకపోవడం, చట్టాలను గౌరవించడం కూడా దేశభక్తే.

1942లో ప్రజలకు తమ పాలకులను ఎన్నుకునే హక్కు లేదు. నేడు మనకు ఆ హక్కు ఉంది. కానీ ఓటు హక్కును డబ్బు, మద్యం, కులం, మతం, ప్రాంతం, తాత్కాలిక ప్రలోభాల కోసం వినియోగిస్తే స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు మనం న్యాయం చేసినట్లా? ప్రజాస్వామ్యంలో ఓటు కేవలం హక్కు కాదు; అది బాధ్యత. నేటి తరానికి రాజకీయ చైతన్యం అవసరం. నాయకులను ప్రశ్నించడం ప్రజాస్వామ్య వ్యతిరేకత కాదు. పాలనలో పారదర్శకత కోరడం దేశద్రోహం కాదు. ప్రజా సమస్యలపై మాట్లాడటం రాజకీయ ప్రయోజనం కోసం మాత్రమే కాదు. ప్రజలు ప్రశ్నించినప్పుడే పాలకులు బాధ్యత వహిస్తారు. 1942లో బ్రిటిష్ ప్రభుత్వం సమాచారాన్ని నియంత్రించడానికి ప్రయత్నించింది. నేడు సమాచార సముద్రంలోనే మరో ప్రమాదం ఉంది.. అపసమాచారం. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి సందేశాన్ని నిజమని నమ్మడం, ధృవీకరించకుండా పంచుకోవడం, తప్పుడు వార్తల ఆధారంగా ద్వేషాన్ని పెంచడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. కృత్రిమ మేధతో రూపొందుతున్న డీప్‌ఫేక్‌లు, నకిలీ వీడియోలు, వక్రీకరించిన సమాచారం మరింత పెద్ద సవాలుగా మారుతున్నాయి. అందుకే నేటి యువతకు సమాచార స్వాతంత్ర్యంతో పాటు సమాచార బాధ్యత కూడా అవసరం.

స్వాతంత్ర్యం వచ్చినా సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు పూర్తిగా అందాయా? కుల వివక్ష, లింగ వివక్ష, ఆర్థిక అసమానతలు, పేదరికం, బాల కార్మికత్వం, మహిళలపై హింస వంటి సమస్యలు ఇంకా మన ముందే ఉన్నాయి. 1942లో విదేశీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఒక్కటయ్యారు. నేడు విభజన రాజకీయాలకు, ద్వేషానికి, వివక్షకు వ్యతిరేకంగా సమాజం ఒక్కటవ్వాలి. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ బలం. భాషలు వేరు కావచ్చు. సంస్కృతులు వేరు కావచ్చు. ఆచారాలు వేరు కావచ్చు. కానీ భారతీయత మనందరినీ కలిపే బంధం. 1942లో ఉద్యమానికి విద్యార్థులు, యువత పెద్దఎత్తున అండగా నిలిచారు. నేడు కూడా దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. అయితే యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే తరం కాకూడదు. ఉద్యోగాలను సృష్టించే తరం కావాలి. సమస్యలను గుర్తించే తరం మాత్రమే కాకుండా పరిష్కారాలను చూపించే తరం కావాలి. కృత్రిమ మేధ నుంచి అంతరిక్షం వరకు, వ్యవసాయం నుంచి స్టార్టప్‌ల వరకు, పరిశోధన నుంచి సామాజిక సేవ వరకు యువత తన ముద్ర వేయాలి.

**- విద్యారాణి పూరడి**

దేశ సరిహద్దులను కాపాడేవారు జవాన్లు. ఉగ్రవాదుల తూటాలకు ఎదురొడ్డి నిలిచేవారు జవాన్లు. ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు ప్రజలను రక్షించేందుకు ముందుండేవారు జవాన్లు. శాంతిభద్రతల పరిరక్షణలోనూ కీలక పాత్ర పోషించేవారు జవాన్లే. కానీ దేశ ప్రజల ప్రాణాలకు కాపలా కాస్తున్న ఆ జవాన్ల ప్రాణాలకు మాత్రం ఎవరు కాపలా కాస్తున్నారు?

# జవాన్ల ప్రాణాలకు ఎవరు కాపలా?



గత ఐదేళ్లలో 55 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్న గణాంకం ప్రతి భారతీయుడినీ కలచివేయాలి. ఇది సాధారణ గణాంకం కాదు. ప్రతి సంఖ్య వెనుక ఒక కుటుంబం ఉంది. ఒక తల్లి ఉంది. ఒక భార్య ఉంది. పిల్లల భవిష్యత్తుపై ఎన్నో కలలు ఉన్నాయి. దేశం కోసం విధులు నిర్వర్తిస్తూ ఇంటికి తిరిగి వస్తాడని ఎదురుచూసిన కుటుంబానికి చివరికి చేరేది ఒక విషాద వార్త. జవాను ఆత్మహత్య చేసుకున్నాడంటే సమస్య అతనిలోనే ఉందని భావించడం అత్యంత ప్రమాదకరం. ఒక వ్యక్తి తన ప్రాణాలను తీసుకునే స్థితికి చేరుకోవడానికి ముందు ఎన్నో రోజుల పాటు, ఎన్నో నెలల పాటు అతని మనసులో సంఘర్షణ సాగి ఉండవచ్చు. ఒత్తిడి, ఒంటరితనం, కుటుంబ సమస్యలు, విధి భారం, నిద్రలేమి, సెలవుల కొరత, నిరంతర అప్రమత్తత, పై అధికారుల ఒత్తిడి.. ఇవన్నీ కలిసి ఒక సైనికుడి మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది.

సీఆర్పీఎఫ్ వంటి దళాల్లో విధులు సాధారణ ఉద్యోగాలతో పోల్చలేం. ఎప్పుడు ఎక్కడ విధులు వస్తాయో తెలియదు. కుటుంబానికి దూరంగా ఉండాల్సి రావచ్చు. పండుగలు, పుట్టినరోజులు, పిల్లల పాఠశాల కార్యక్రమాలు.. జీవితంలోని ఎన్నో ముఖ్యమైన సందర్భాలను జవాన్లు త్యాగం చేయాల్సి వస్తుంది. విధుల్లో ఉన్నప్పుడు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడి నుంచి ప్రమాదం వస్తుందో తెలియదు. ఎవరిని నమ్మాలో, ఎవరిని అనుమానించాలో నిర్ణయించాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. ఈ నిరంతర ఒత్తిడి మనిషి మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపకుండా ఉండదు. దేశభక్తి అనే ఒక్క మాటతో ఈ బాధను మొత్తం భరించగలరని అనుకోవడం అమాయకత్వం. జవాను కూడా మనిషే. అతనికీ బాధ ఉంటుంది. భయం ఉంటుంది. కుటుంబంపై ఆందోళన ఉంటుంది. ఒంటరితనం ఉంటుంది. తన సమస్యను ఎవరికైనా చెప్పాలనే కోరిక ఉంటుంది. కానీ తన బాధను చెప్పుకునేందుకు సరైన వేదిక లేకపోతే? అదే అసలు ప్రశ్న.

మానసిక ఒత్తిడితో బాధపడుతున్న జవానును బలహీనుడిగా చూడటం మరో ప్రమాదకరమైన సమస్య. "నువ్వు జవానువి.. ధైర్యంగా ఉండాలి" అని చెప్పడం సులభం. కానీ ధైర్యం అంటే కన్నీళ్లను దాచుకోవడం కాదు. బాధను అణచుకోవడం కాదు. అవసరమైనప్పుడు సహాయం కోరగలగడం కూడా ధైర్యమే. మానసిక ఆరోగ్యం గురించి మాట్లాడటం సిగ్గు కాదనే భావన భద్రతా దళాల్లో బలపడాలి. కౌన్సెలింగ్‌కు వెళ్లినందుకు ఎలాంటి అపహాస్యం, వివక్ష, పదోన్నతులపై ప్రతికూల ప్రభావం ఉండకూడదు. ప్రతి యూనిట్‌లో నిపుణులైన మానసిక ఆరోగ్య నిపుణుల అందుబాటు ఉండాలి. అవసరమైనప్పుడు గోప్యంగా మాట్లాడుకునే అవకాశం కల్పించాలి. సమస్య తీవ్రమయ్యే వరకు వేచి చూడకుండా ముందుగానే గుర్తించే వ్యవస్థ ఉండాలి. జవాన్ల కుటుంబాలు కూడా ఒక రకమైన మౌన యుద్ధమే చేస్తుంటాయి. భర్త నెలల తరబడి ఇంటికి రాక పోవచ్చు. తండ్రి పిల్లల పెరుగుదలను దూరం నుంచే చూడాల్సి రావచ్చు. భార్య ఒంటరిగా కుటుంబ బాధ్యతలు నిర్వహించాల్సి రావచ్చు. తల్లిదండ్రులు కొడుకు ఎప్పుడు వస్తాడో తెలియని అనిశ్చితిలో జీవించాల్సి రావచ్చు. ఈ కుటుంబ ఒత్తిడి కూడా జవాను మానసిక స్థితిపై ప్రభావం చూపుతుంది. అందుకే సిబ్బందికి సెలవులు మంజూరు చేసే విధానాన్ని మరింత మానవీయంగా మార్చాలి. అత్యవసర కుటుంబ పరిస్థితుల్లో వెంటనే స్పందించే వ్యవస్థ ఉండాలి. కుటుంబాలతో క్రమం తప్పకుండా మాట్లాడే అవకాశం కల్పించాలి. సాంకేతికత అందుబాటులో ఉన్న ఈ కాలంలో వీడియో కాల్ వంటి సాధనాలను మరింత సమర్థంగా వినియోగించాలి.

విశ్రాంతి అనేది జవానుకు ఇచ్చే సౌకర్యం కాదు. అది అతని శారీరక, మానసిక సామర్థ్యాన్ని నిలబెట్టే అవసరం. నిరంతర విధులు, తగిన విశ్రాంతి లేకపోవడం, వరుసగా ఒత్తిడితో కూడిన బాధ్యతలు అప్పగించడం వల్ల మానసిక అలసట పెరుగుతుంది. అలాంటి పరిస్థితుల్లో "దేశ సేవ" అనే భావనను ముందుకు పెట్టి అన్నింటినీ భరించాలని కోరడం సరైంది కాదు. దేశానికి ఉత్తమ సేవ చేయాలంటే ముందుగా జవాను ఆరోగ్యంగా ఉండాలి. పై అధికారులు కేవలం ఆదేశాలు ఇచ్చేవారిగా కాకుండా సిబ్బంది సమస్యలను వినేవారిగా ఉండాలి. ప్రతి జవానుతో అప్పుడప్పుడు వ్యక్తిగతంగా మాట్లాడే విధానం ఉండాలి. అతని ప్రవర్తనలో వచ్చిన ఆకస్మిక మార్పులను గుర్తించే శిక్షణ సహచరులకు, అధికారులకు ఇవ్వాలి. ఒక జవాను అకస్మాత్తుగా ఒంటరిగా ఉండటం, తీవ్ర ఆందోళనకు గురికావడం, విధుల పట్ల ఆసక్తి కోల్పోవడం, కుటుంబ సమస్యల గురించి పదేపదే మాట్లాడటం వంటి సంకేతాలను నిర్లక్ష్యం చేయకూడదు. ఆత్మహత్యకు ముందు కనిపించే సంకేతాలను గుర్తించడం కూడా ప్రాణరక్షణలో భాగమే. 55 మంది అనే సంఖ్యను చూసి చర్చ ముగించకూడదు. "ఎందుకు?" అనే ప్రశ్నకు సమాధానం వెతకాలి. ఎంతమందికి తీవ్రమైన కుటుంబ సమస్యలు ఉన్నాయి? ఎంతమంది విధి ఒత్తిడితో బాధపడ్డారు? ఎంతమందికి మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉన్నాయి? ఎంతమంది సమస్యలను పై అధికారులకు చెప్పగలిగారు? ఎంతమంది సెలవుల కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు? ఎంతమందిలో ప్రమాద సంకేతాలను ముందుగానే గుర్తించగలిగారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు బయటకు రావాలి. గణాంకాలను ప్రకటించడం మాత్రమే కాదు.. వాటి వెనుక ఉన్న కారణాలను అధ్యయనం చేసి పరిష్కారాలను అమలు చేయాలి.

ఒక జవాను ప్రాణాలు కోల్పోయిన తర్వాత కుటుంబానికి పరిహారం ప్రకటించడం ప్రభుత్వ బాధ్యతలో ఒక భాగం మాత్రమే. కానీ అసలు బాధ్యత అతను ఆ స్థితికి చేరకుండా చూడటం. ప్రతి భద్రతా దళంలో మానసిక ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం కావాలి. క్రమం తప్పకుండా మానసిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి. అత్యవసర సహాయం అందించే గోప్యమైన వ్యవస్థ ఉండాలి. కుటుంబ సభ్యులకు కూడా అవసరమైన కౌన్సెలింగ్ అందించాలి. ఇది ఒక్క సీఆర్పీఎఫ్ సమస్యగా చూడకూడదు. దేశంలోని అన్ని భద్రతా దళాల్లో ఇలాంటి సమస్యలపై సమగ్ర అధ్యయనం జరగాలి. జవాన్లను మనం తరచూ "దేశానికి ప్రాణం ఇచ్చేవారు" అని కొనియాడుతాం. కానీ దేశానికి ప్రాణం ఇవ్వడం వారి విధి కాదు. దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టాల్సిన పరిస్థితుల్లోనూ, వారు సురక్షితంగా ఇంటికి తిరిగి వచ్చేలా చూడటం దేశ బాధ్యత. జవానుచేతిలో తుపాకీ పెట్టి సరిహద్దుకు పంపడం మాత్రమే దేశభక్తి కాదు. అతని మనసులోని భయాన్ని వినడం కూడా దేశభక్తే. అతని కుటుంబ సమస్యను పరిష్కరించడం కూడా దేశభక్తే. అతనికి విశ్రాంతి ఇవ్వడం కూడా దేశభక్తే. అతను కుంగిపోతున్నప్పుడు చేయి అందించడం కూడా దేశభక్తే.



**రణధీర్ గుండు**

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.